ప్రజాశక్తి

మంగళవారం 28 జనవరి 2025 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న టిడ్కో గృహాల లబ్ధిదారులు

వార్త 3లో

టిడ్కో రుణాలు రద్దు కోరుతూ ధర్నా

భూ లావాదేవీలకు ఊపొచ్చేనా?

రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు నుండి రాజధానికి మినహాయింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని అమరావతిలో గత ఆరు నెలలుగా భూముల క్రయ విక్రయాల్లో మందగమనం కొనసాగుతోంది. భూ యజమానులు ధరలను భారీగా పెంచడం వల్ల ఎక్కువ మంది రాజధాని గ్రామాలకు వచ్చి వెళ్తున్నారే తప్ప కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. ఈనేపథ్యంలో రాజధాని గ్రామాలకు రిజిస్ట్రేషన్ విలువ పెంపు ఉండదని ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఫిబ్రవరి 1 నుండి రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రిజిస్ట్రేషన్ విలువలు అమలులోకి రానుండగా రాజధాని పరిధిలోని 29 గ్రామాలకు ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. అయితే రాజధాని గ్రామాల్లో మాత్రం రిజిస్ట్రేషన్ విలువల్లో ఎటువంటి మార్పు ఉండదని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ప్రకటించారు. క్రయ విక్రయాలు ఎక్కువగా ఉండి, రిజిస్ట్రేషన్ విలువ కన్నా మార్కెట్ విలువ 10 రెట్లు అదనంగా ఉన్న ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ విలువలు పెంచనున్నారు. రాజధాని గ్రామాల్లో మాత్రం లావాదేవీలు మందగమనంగా ఉండటం వల్ల పెంపు ప్రతిపాదనలను 29 గ్రామాలకు మినహాయింపు ఇచ్చారు. ప్రస్తుతం రాజధాని గ్రామాల్లో ప్రధాన రహదారుల పక్కన ఉన్న భూముల్లో గజం రూ.70 వేల వరకు పలుకుతోంది. మెట్ట ప్రాంతంలో కనిష్టంగా రూ.40 వేలు, గరిష్టంగా రూ.50 వేలు పలుకుతుండగా జరీబు గ్రామాల్లో కనిష్టంగా రూ.50 వేలు, గరిష్టంగా రూ.80 వేల వరకు చెబుతున్నారు. దీంతో ఈ ధరలకు కొనుగోలుదారులు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికే ధరలు అధికంగా ఉన్నందున మళ్లీ భూముల విలువ పెంచితే ఇబ్బందులు వస్తాయని, కొనుగోలు దారులపై ఛార్జీల భారం కూడా పడుతుందనే భావనతో ప్రభుత్వం మినహాయింపు నిర్ణయాన్ని తీసుకన్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం రాజధాని గ్రామాల కన్నా తాడికొండ, అమరావతి, క్రోసూరు, పెదకూరపాడు, సత్తెనపల్లి, మంగళగిరి, తాడేపల్లి, పెదకాకాని మండలాల్లోనే అధికంగా లావాదేవీలు జరుగుతున్నాయి. మరోవైపు రాజధాని రైతులకు కేటాయించిన ప్లాట్లలో అభివృద్ధి పనులకు సిఆర్‌డిఎ వారు టెండర్లను పిలిచారు. మొత్తం రూ.11,467 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టారు. రూ.2498 కోట్లతో సీడ్ కేపిటల్‌లో నిర్మించే 360 కిమీల ట్రంక్ రోడ్ల నిర్మాణం, రాజధాని గ్రామాల్లో ముంపు నివారణకు రూ.1585 కోట్లతో పాలవాగు, కొండవీటి వాగు, గ్రావిటీ కెనాల్‌తో పాటు రిజర్వాయర్లు ఏర్పాటు చేయనున్నారు. గెజిటెడ్, నాన్ గెజిటెడ్, క్లాస్ -4, ఆల్ ఇండియా



సర్వీస్ అధికారుల భవనాలు పనులను రూ.3523 కోట్లతో చేపట్టనున్నారు. రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ లే అవుట్లలో రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు రూ. 3859 కోట్లకు అనుమతి ఇచ్చారు. ఈమేరకు టెండర్లు కూడా పిలిచారు. ఫిబ్రవరి 10 వ తేదీ నుంచి రాజధానిలో అభివృద్ధి పనులు ఊపందుకుంటాయని అధికారులు చెబుతున్నారు. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్‌లోని 5 ఐకానిక్ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు భవనాలు డిజైన్లకు ఇప్పటికే టెండర్లు పిలిచారు. 70 నుంచి 80 శాతం పూర్తయిన వివిధ తరగతుల బహుళ అంతస్తుల భవనాలను పూర్తి చేసే పనులు కూడా ప్రారంభమయ్యాయి. గెజిటెడ్ ఆఫీసర్ల గృహ సముదాయం వద్ద మౌలిక వసతుల కల్పన పనులను రూ.226.26 కోట్లతో చేపట్టనున్నారు. నాన్ గెజిటెడ్ ఆఫీసర్ల ఇళ్లకు మిగిలిన పనులను పూర్తి చేయడానికి రూ.607.50 కోట్లు కేటాయించారు. ఆలిండియా సర్వీస్ అధికారులు (ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు)కు 115 బంగ్లాల పెండింగ్ పనులను రూ.516.6 కోట్లతో చేపట్టనున్నారు. రైతులకు కేటాయించిన భూముల్లో మొత్తం 8496.30 ఎకరాల్లో మౌలిక వసతులను రూ.3859.66 కోట్లతో చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. నెక్కల్లు, అనంతవరం, శాఖమూరు, నేలపాడు, తుళ్లూరు, అబ్బరాజుపాలెం, బోరుపాలెం, దొండపాడు, రాయపూడి, కొండమరాజుపాలెం తదితర గ్రామాల్లో రైతులకు కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్లకు అభివృద్ధికి ఈ నిధులు ఖర్చుచేస్తారు. అభివృద్ధి పనులు వేగం పుంజుకుంటే రాజధానిలో క్రయ విక్రయాలు ఊపందుకుంటాయని రైతులు, భూ యజమానులు భావిస్తున్నారు.

డిసిపిగా సరిత బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి - విజయవాడ : అడ్మిన్ డిసిపిగా కె.జి.వి.సరిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా సిఐడిలో ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న ఆమెను ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ అడ్మిన్ డిసిపిగా బదిలీ అయ్యారు. ఆమె పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని తన ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబును మర్యాద పూర్వకంగా కలిశారు.

నకిలీ వరి విత్తనాలు

ఇంటి కూల్చి వేతలపై మీ కోసంలో వినతులు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

నకిలీ వరి విత్తనాలతో తీవ్రంగా నష్టపోయాయని మచిలీపట్నం మండలం రుద్రవరం పంచాయతీ శివారు ఆర్ గొల్లపాలెంకు చెందిన దేవనబోయిన ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కారం కోరుతూ మచిలీపట్నంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీ కోసంలో జిల్లా కలెక్టర్ డి.కె బాలాజీకి పలువురు వినతిపత్రం అందించారు. బాపట్ల జిల్లా రేపల్లెలో శ్రీతేజ సీడ్స్ కంపెనీకి చెందిన బిపిటి 5204 విత్తనాలు 30 కిలోల బ్యాగ్‌లు 17 కొనుగోలు చేసి కౌలు భూమి 25 ఎకరాల్లో సాగు చేసినట్లు ప్రసాద్ కలెక్టర్‌కు తెలిపారు. నకిలీ విత్తనాల కారణంగా ఎకరాకు 15 బస్తాలకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని వాపోయాడు. కంపెనీ నుంచి నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. పెనమలూరు పంచాయతీ కార్యదర్శి తమ ఇంటిని అక్రమంగా కూల్చివేశారని ఆ గ్రామానికి చెందిన సోము మహేశ్వరరావు వాపోయారు. గ్రామంలోని పేరంటాళ్లమ్మ చెరువు కట్టపై నిర్మించుకున్న ఇంట్లో 13 ఏళ్లుగా తమ కుటుంబం జీవిస్తోందని, ఈ నెల 16వ తేదీ సాయంత్రం ఎవరూ ఇంట్లో లేని సమయంలో పంచాయతీ కార్యదర్శి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా ఇల్లు కూల్చేశారని తెలిపారు. రెండు లక్షల విలువైన ఆస్తి ధ్వంసమైందని, ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శిపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పెదపారుపూడిలో తమ పేరుతో ఉన్న ఇంటి పన్నును మార్చిన గ్రామ కార్యదర్శి, పొజిషన్ సర్టిఫికెట్‌లో పేరును మార్చిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన పాతకోట మాణిక్యాలరావు కోరారు.

ప్లాట్ డబుల్ రిజిస్ట్రేషన్

గుడివాడ మండలం తట్టివర్రు గ్రామానికి చెందిన గుంజా నిర్మలకుమారి కానూరులోని ఓ అపార్టుమెంట్లో ప్లాట్ కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకున్నారు. ఈ ప్లాట్‌ను బిల్డర్ మరొకరికి రిజిస్ట్రేషన్ చేశారని వాపోయారు. డబుల్ రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్‌కు తక్షణమే షోకాజ్ నోటీసులు పంపాలని జిల్లా రిజిస్ట్రార్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

యంత్రాలతో ఇసుక తరలింపు

వార్త 3లో

ప్రతి వ్యక్తి మస్తిష్కం ఓ గ్రంథాలయమే

డి స్పేస్ సాఫ్ట్‌వేర్ జాతీయ కార్యశాల ప్రారంభోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఫాదర్ గొర్డెన్ లైబ్రరీ ఆంధ్ర లొయోల కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజుల డి స్పేస్ అనే సాఫ్ట్వేర్పై జాతీయ కార్యశాల సోమవారం ప్రారంభమైంది. ఈకార్యమ్రానికి వివిధ ప్రభుత్వ, ప్రైవేటు విశ్వవిద్యాలయాల నుండి 80 మంది గ్రంథాలయ అధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి బెంగుళూరుకు చెందిన ఐఎస్ఐ ప్రొఫెసర్ ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ సంస్థాగత సమాచార వ్యవస్థ ద్వారా కలిగే అనేక ప్రయోజనాలను వివరించారు. గణాంకాలు, చారిత్రక ఆధారాలు, సంఘటనలు మన మస్తిష్కంలో నిక్షిప్తం అయ్యినప్పుడు ప్రతి వ్యక్తి ఒక గ్రంథాలయంగా మారవచ్చని ఆయన అన్నారు. నేడు పుస్తక పఠనం తగ్గుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. పుస్తక పఠనాన్ని ఒక ఉద్యమంగా తీసుకురావడానికి డి స్పేస్ అనే సమాచార వ్యవస్థ ద్వారా గ్రంథాలయ అధిపతులు, అధ్యాపకులు కషి చేయాలన్నారు. రెక్టర్ డాక్టర్ పి.ఆర్.జాన్ మాట్లాడుతూ విజ్ఞాన సుగంధాలను వెదజల్లడం ద్వారా గ్రంథాలయం మానవ వికాసానికి దోహదపడుతుందన్నారు. ఈ విజ్ఞానఘనికి డి స్పేస్ అనే సమాచార వ్యవస్థ మరో కలికితురాయి కాగలదన్నారు. రెవరెండ్ ఫాదర్ కరస్పాండెంట్ డాక్టర్ సగాయరాజ్ మాట్లాడుతూ ముద్దబంతి పువ్వులో రేకలు అమరినట్లు కళాశాల వివిధ సామాచారాన్ని పుస్తక వివరాలని క్రమ పద్ధతిలో భద్రపరిచేదే డి స్పేస్ అనే సమాచార వ్యవస్థ అని, ప్రతి విద్యార్థికి క్షణంలో కావలసిన పుస్తకాన్ని, సమాచారాన్ని అందించే ఈ వ్యవస్థ... గ్రంథాలయాన్ని మరింత పటిష్టం చేస్తుందని అన్నారు. ఈ కార్యశాల నిర్వాహక కార్యదర్శి డాక్టర్ టి. రోజామణి సభను నిర్వహించారు. కన్వీనర్ డాక్టర్ జి.ఎ. ప్రసాద రావు వందన సమర్పణ చేశారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సోమశేఖర రావు, గంథాలయ కమిటీ సభ్యులు రెవరెండ్ ఫాదర్ డాక్టర్ ప్రభుదాస్, ఎస్.ఎ.బి.నెహ్రూ, డాక్టర్ జి.మురళి కష్ణ, కెటిఎస్ఎస్. తోమాస్, డాక్టర్ తుమ్మల శ్రీ కూమార్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో బెంగుళూరు ప్రొఫెసర్ కృష్ణమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం



కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టుల గృహ నిర్మాణ సంఘం నాయకులు సిహెచ్.సతీష్‌బాబు తదితరులు

జర్నలిస్టుల స్థలాన్ని పరిరక్షించండి

కలెక్టర్‌కు సహకార గృహ నిర్మాణ సంఘం వినతి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ది విజయవాడ వర్కింగ్ జర్నలిస్టుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘానికి ప్రభుత్వం కేటాయించిన స్థలంలో వేసిన అక్రమ కట్టడాలను తొలగించి, హద్దులు నిర్ణయించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశకు జర్నలిస్టుల గృహ నిర్మాణ సంఘం విజ్ఞప్తి చేసింది. నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చిగురుపాటి సతీష్‌బాబు నేతత్వంలో డైరెక్టర్లు, సభ్యులు ఈమేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సంఘం మహా జనసభ ఆదివారం మధ్యాహ్నం జర్నలిస్టుల కాలనీ స్థలంలో జరిగిందని, ఈ సమయంలో అక్రమ ఆక్రమణల విషయం గుర్తించామని కలెక్టర్‌కు సంఘం నాయకులు వివరించారు. మహా జనసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దష్టికి విషయం తీసుకెళ్లగానే వెంటనే స్పందించి విజయవాడ రూరల్ తహశీల్దార్‌తో మాట్లాడారని తెలిపారు. తమ స్థలంలో ఉన్న ఆక్రమణలు తొలగించి, స్థలాన్ని పరిరక్షిస్తూ బోర్డులు పెట్టాలని, సరిహద్దులు నిర్ణయించాలని ఆయన సూచించినట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సొసైటీకి కేటాయించిన ప్రభుత్వ భూమి 2 ఎకరాల 15 సెంట్లకు సరిహద్దులు నిర్ణయించి, పరిరక్షించాలని కలెక్టర్‌కు నేతలు విజ్ఞప్తి చేశారు.



ఉప్పులేటి ప్రసాదరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉప్పులేటి నేతాజీ, సత్య ప్రసాద్, సుందర ప్రసాద్, దేవి ప్రసాద్, డాక్టర్ తారక ప్రసాద్

ఉప్పులేటి ప్రసాదరావుకు ఘన నివాళులు

హనుమాన్ జంక్షన్ : వ్యక్తిత్వంలో తనకంటూ ఒక ప్రత్యేకత సంపాదించుకున్న ఉప్పులేటి ప్రసాదరావు చిరస్మణీయుడని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం కృష్ణాజిల్లా బాపులపాడు మండలం బండారుగూడెంలో ఉప్పులేటి ప్రసాదరావు 33వ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న ఉప్పులేటి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళలర్పించారు. మహోన్నత వ్యక్తిగా, శక్తిగా ఉప్పులేటి ప్రసాదరావు చేసిన సేవలు అనిర్వచనీయమని అన్నారు. బండారుగుడెం సర్పంచ్‌గా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారని అన్నారు. అనంతరం ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ఉప్పులేటి నేతాజీ, సత్య ప్రసాద్, సుందర ప్రసాద్, దేవి ప్రసాద్, డాక్టర్ తారక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ వేడుకలు



ప్రజాశక్తి - విజయవాడ : కనకదుర్గ గజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ అంబేద్కర్ నగర్ అంబేద్కర్ పార్క్‌లో సోమవారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ పతాకాన్ని జనహిత వేదిక అధ్యక్షులు, ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర మాజీ నాయకులు యు.ఎ.నేతాజీ ఆవిష్కరించారు. రేమల్లి ప్రమోద్, సురేంద్ర, పి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను వేగంగా పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీల పరిష్కార నాణ్యతలో జిల్లాను నెంబరు వన్‌గా నిలిపేందుకు అధికారులు నిబద్ధతతో కషిచేయాలని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ.. డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి పి.జ్యోతి తదితరులతో కలిసి ప్రజల నుంచి 145 అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 56, పురపాలక పట్టణాభివద్ధికి 30, పోలీస్ శాఖకు 9 అర్జీలు వచ్చాయి. పంచాయతీరాజ్, సర్వే విభాగాలకు ఏడు చొప్పున, విద్యాశాఖకు సంబంధించి 6 అర్జీలు వచ్చాయి. ఉపాధికల్పన 5, ఆరోగ్యం 4, వికలాంగుల సంక్షేమం 3, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ 3 అర్జీలు రాగా వ్యవసాయం, ఏపీఎస్ఆర్‌టీసీ, పౌర సరఫరాలు, ఇరిగేషన్‌కు రెండు చొప్పున అర్జీలు అందాయి.



ప్రతి ఫిర్యాదును పరిశీలించండి : విఎంసి కమిషనర్

ప్రజాశక్తి - విజయవాడ : ప్రతి సమస్యనూ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఆయన సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 16 ఫిర్యాదులు అందగా, వీటికి పట్టణ ప్రణాళిక విభాగం అర్జీలు 8, ఇంజనీరింగ్ 7, హౌసింగ్ నుండి ఒక ఫిర్యాదును అంధికారులు అందుకున్నారు. అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్స్ డాక్టర్ డి చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జివిజిఎస్‌వి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి.సజన, ఇంచార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఇంచార్జ్ ఎస్టేట్ ఆఫీసర్, జోన్ డైరెక్టర్ అమత్ డాక్టర్ లత, సూపరింటెండింగ్ ఇంజనీర్లు పి.సత్యనారాయణ, పి సత్యకుమారి, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి, ఆర్ఎఫ్ఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.




జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ యు.తారక ప్రసాద్, చిత్రంలో సూపరింటెండెంట్ జ్యోతి

ఇఎస్ఐ ఆస్పత్రిలో గణతంత్ర వేడుకలు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : గుణదలలోని ఇఎస్ఐ ఆస్పత్రిలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆస్పత్రి ఆర్ఎంఒ డాక్టర్ ఉప్పులేటి తారక ప్రసాద్ ఆవిష్కరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జ్యోతి, డాక్టర్ వర్మ, ఆఫీసు సూపరింటెండెంట్ ప్రగతి, వైద్య, పారా మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిపి కార్యాలయంలో 77 ఫిర్యాదులు స్వీకరణ

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో 77 ఫిర్యాదులను స్వీకరించారు. డిసిపి ఎబిటిఎస్ ఉదయారాణి ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై భాదితులతో మాట్లాడారు. ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అందిన ఫిర్యాదుల్లో నగదు లావాదేవీలకు సంబంధించినవి 21, భార్యాభర్తలు, కుటుంబ కలహాలవి 10, మహిళా సంబంధిత నేరాలవి 2, భూవివాదాలవి 22, సైబర్ నేరాలవి 1, వివిధ మోసాలవి 6, దొంగతనాలవి 1, కొట్లాటవి 1, ఇతర చిన్న చిన్న వివాదాలవి 13 ఉన్నాయి.



సూర్యఘర్ ద్వారా 1.10 లక్షల మందికి రుణాలు : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : పిఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ ప్యానెల్ కనెక్షలను ఏర్పాటు చేసేందుకు 1.10 లక్షల మంది లబ్దిదారులకు రుణాలను మంజూరు చేయాలన్న లక్ష్యాలను పూర్తి చేసేందుకు బ్యాకర్లు కషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. ఈ అంశంపై ఆయన సోమవారం కలెక్టరేట్లో బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు.

30 మందికి జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ : మద్యం తాగి వాహనాలు నడిపిన 30 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. 1వ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 30 కేసుల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన చోదకులను సోమవారం కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి వెంకటేశ్వర శర్మ ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

నాగభూషణం వర్ధంతి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : లయోలా వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, జనహిత వేదిక మాజీ గౌరవాధ్యక్షులు చిగురుపాటి నాగభూషణం తృతీయ వర్ధంతి కార్యక్రమం సోమవారం జరిగింది. లయోలా కళాశాల సమీపంలోని యలమంచిలి కాంప్లెక్స్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి కాంగ్రెస్ మాజీ నాయకులు మేరుగు ప్రసాద్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి జనహిత వేదిక అధ్యక్షులు ఉప్పులేటి నేతాజీ అధ్యక్షత వహించారు. ఆయన కుమారుడు సిహెచ్.ప్రతాప్, మాజీ ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, లెక్చరర్ ఎస్.కృష్ణ, గంధం శివ, మొక్కపాటి వెంకట నారాయణ, రాములు, అంకయ్య, వెంకటేశ్వరరావు, కొండలు, రాజు తదితరులు పాల్గొన్నారు. ఆది శేషారావు వందన సమర్పణ చేశారు.



టిడ్కో రుణాలు రద్దు కోరుతూ ధర్నా

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): గతేడాది జరిగిన ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు టిడ్కో గృహాల రుణాలు రద్దు చేయాలని, కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ గుడివాడ టిడ్కో కాలని అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అభివద్ధి కమిటి కార్యదర్శి బసవ అరుణ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రస్తుత గుడివాడ శాసన సభ్యులు వెనిగండ్ల రాము తనను గెలిపిస్తే అధికారంలోకి రాగానే టిడ్కో గహాల రుణాలు రద్దు చేయిస్తానని కాలని ప్రజలకు వాగ్దానం చేయడం తో తామంతా ఎంతో ఆశతో ఓట్లు వేసి గెలిపించామని అయితే అధికారం చేపట్టి ఏడు నెలలుగా వస్తున్న ఇచ్చిన హామీ అమలు చేయడం లేదన్నారు హామీ అమలు చేయాలని పలుసార్లు శాసనసభ్యుని కలిసి విన్నవించిన స్పందన మాత్రమే ఉందని పైగా బ్యాంకు వారు నోటీసులు జారీ చేస్తున్నారని ప్రస్తుతం ఏం చేయాలో తెలియక తామంతా ఆందోళన గురవుతున్నమన్నారు. అసలే గత ఆరు నెలలుగా ఇసుక కొరత ఆర్థిక మాంద్యం తదితర సమస్యల వల్ల ఉపాధి కొరవడిందని దీనివల్ల ఆర్థిక ఇబ్బందులూ ఎదుర్కొంటున్నామన్నారు. రుణమాఫీ పోరాటం కొనసాగుతున్నందున బ్యాంకు వారు నోటీసులు, ఇచ్చి బెదిరించడం ఫోన్ చేసి బెదిరించడం తాళాలు వేస్తామని, జప్తు చేస్తామని చేసి బెదరింపులు ఆపాలని, అసలుకు వడ్డీ ని తీసుకువెళ్ళి, సంవత్సరం చివరిలో అసలు లో కలిపి చక్రవడ్డీ వసూళ్లు చేసి తిరగ రాయించుకొనే పద్ధతి ఆపాలన్నారు. ప్రభుత్వం స్పందించే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.అలాగే టిడ్కో కాలనీ ని మున్సిపాలిటీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఇచ్చిన హామీ మేరకు రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కాలనిలో కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయకపోవడంతో కాలనీలో నివసించలేకపోతున్నామని కనీసం వాడుకోవడానికి పునీరు కూడా అందుబాటులో లేదని కాబట్టి వెంటనే మంచినీరు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు .అలాగే కాలనిలో ఆసుపత్రి,పాఠశాల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ గుడివాడ మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పనకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అలాగే తాగునీటి సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడ్కో కాలనీ అభివద్ధి కమిటీ సభ్యులు నూరున్నిసా, ఆర్.శివారాంప్రసాద్, టి.అప్పలనాయుడు, రాయల గణేష్, సంబంగి రంగమ్మ బి మేరమ్మ, అధికారుల ఈశ్వరమ్మ, జి.మాధవి, ఏ. విజయలక్ష్మి, కాలని ప్రజలు పాల్గొన్నారు.



స్కూల్ నిర్మాణానికి నిధులు కోరుతూ వినతి

ప్రజాశక్తి-మోపిదేవి

మండల పరిధిలోని కోసూరువారిపాలెంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పాఠశాల భవనానికి నిధులు మంజూరు చేయాలని గ్రామానికి చెందిన కోసూరు రామాంజనేయులు తాసిల్దార్ మేడపాటి శ్రీవిద్యకు వినతి పత్రం అందజేశారు సోమవారం ప్రజావాణిలో పలు సమస్యలపై తాసిల్దార్ కార్యాలయంలో ప్రజలు ఫిర్యాదులు అందజేశారు చాలా గ్రామాలలో సచివాలయ భవనాలు రైతు భరోసా కేంద్రాలు నిర్మాణాలు మధ్యలో ఆగిపోయి అసంపూర్తిగా ఉండిపోయాయని వాటికి కూడా నిధులు మంజూరు చేయాలని కోసూరు రామాంజనేయులు వినతి పత్రంలో పేర్కొన్నారు.



ఎన్‌టిఆర్‌కు నివాళులర్పిస్తున్న భువనేశ్వరి

భువనేశ్వరికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-చల్లపల్లి: మండల పరిధిలోని పాగోలులోని ఎన్టీఆర్ మోడల్ పాఠశాలను ఎన్టీఆర్ ట్రస్ట్ నారా భువనేశ్వరి సోమవారం సందర్శించి పరిశీలించారు. తొలుతగా చల్లపల్లి ఎన్టీఆర్ పార్క్‌లో నూతనంగా ప్రారంభించిన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. భువనేశ్వరికి ఎన్నారై బొబ్బా గోవర్ధన్, టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, చల్లపల్లి మండల నేతలు మోర్ల రాంబాబు, ముమ్మనేని నాని, యార్లగడ్డ శ్రీనివాసరావు, నిడమానూరి దిలీప్ కుమార్, మోర్ల శివ, వేమూరి రమేష్ బాబు, షేక్ నభీ ఘోరి, మేకా వెంకటేశ్వరరావు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. విక్కుర్తి శ్రీనివాసరావు పూల మొక్కను అందజేశారు. అవనిగడ్డ నియోజకవర్గంలో విక్కుర్తి చేస్తున్న సేవలను తెలుసుకున్న భువనేశ్వరి ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

ఎస్‌పికి 31 ఫిర్యాదులు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మీ కోసం లో వచ్చే ప్రజా సమస్యలకు నిర్ణీత సమయంలో పరిష్కారం అందించాలని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ప్రియా జిల్లా ఎస్పీ ఫిర్యాదుదారుల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్య విని సానుకూలంగా స్పందించి, వారి సమస్యపై తప్పక న్యాయం చేస్తామనే నమ్మకాన్ని వారిలో కలిగించాలన్నారు.మొత్తం 31 ఫిర్యాదులు అందాయని ఎస్పీ కార్యాలయ అధికారులు తెలిపారు.ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి. సత్యనారాయణ పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారానికి తరలిరావాలి

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: రాష్ట్ర నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం జరుగుతుందని కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని మచిలీపట్నం పార్లమెంటు బీసీ సెల్ అధికార ప్రతినిధి జిడుగు అశోక్ కుమార్ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, పలువురు ప్రజా ప్రతినిధులు హాజరవుతారని, జయప్రదం చేయాలని కోరారు.

ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నం మండలం పెదకరగ్రహారం గ్రామంలో పశుసంవర్ధక శాఖ అధ్వర్యంలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. 300 గొర్రెలకు నట్టల నివారణ మందు, 40 దూడలకు నట్టల నివారణ మందు, 120 పెద్ద పశువులకు నట్టల నివారణ మందు, 4 కృత్రిమ గర్భధారణలు, 10 తిరగబోర్లె పశు వులకు, 15 పశువులకు సాధరణ వైద్య చికిత్సలు అందించారు. 40మంది పాడి రైతులు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు మండల పశువైద్య అధికారి డా.దీపక్ దానియల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బత్తిన నాగరాజు, రామారావు, ఎం వీరబాబు, కె ఈశ్వరమ్మ, కె.రంజిత, వి గ్లోరి పాల్గొన్నారు.



పమిడిముక్కల: పశు వైద్య శిబిరాలు గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ ఆధారిత రైతులకు ఎంతో ఉపయోగమని మేడి శశిభూషణ్ అన్నారు. సోమవారం మండలంలోని మేడూరు గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు వెంకటేష్, ఈశ్వర్, రామ్ నరేష్ రైతులు పాల్గొన్నారు.



ఎంపిడిఓ సుధాప్రవీణ్‌కు సత్కారం

ప్రజాశక్తి-కోడూరు: మచిలీపట్నంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చేతులు మీదగా ప్రశంసా పత్రం అందుకున్న కోడూరు మండల ఎంపీడీవో సుధా ప్రవీణ్‌ను ఘనంగా సత్కరించారు. సోమవారం కోడూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద కోడూరు గ్రామపంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావు ఆధ్వర్యంలో సుధాప్రవీణ్‌కు పూలదండలు వేసి, దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండవీటి వెంకటనారాయణ, కడవకోల్లు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

విఓఎల రద్దు జిఓను ఉపసంహరించుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): వెలుగు విఓఎ ఉద్యోగులను తొలగించాలని గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోని వెంటనే రద్దు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏపీ వెలుగు విఓఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం పోలినాయుడు సంఘీభావం తెలిపి మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ తలపెట్టిన గ్రామీణ అభివృద్ధిలో మహిళల కు సేవలు అందిస్తున్న వెలుగు విఓఏ ఉద్యోగులను తొలగించాలని గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో ని వెంటనే రద్దు చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల ఉపాధ్యక్షులు టి చంద్రపాల్ మాట్లాడుతూ రోజురోజుకీ వివో ఏలపై భారం పెంచుతూ మానసిక వేదనకు గురి చేస్తున్నరన్నారు. రోజుకో రకమైన యాప్‌తో విఓఎ జీవితాలతో ప్రభుత్వ ఆటలాడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కార్యదర్శి సి హెచ్ జయరావు మాట్లాడుతూ ప్రభుత్వం మారినప్పుడల్లా వేలాది మందిని అక్రమంగా ఉద్యోగాల నుండి తొలగించడం పరిపాటిగా మారిందని, నిబంధనలకు విరుద్ధంగా 4500 మంది అక్రమంగా తొలగించారని వీరిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె సాంబ, సొంటి భూలక్ష్మి, వెంకటరమణ, ప్రియాంక, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ డికె బాలాజీకి వినతిపత్రం అందజేశారు.





ఘనంగా ఎలక్ట్రీషియన్ డే

ప్రజాశక్తి-గుడివాడ

ది గుడివాడ తాలూకా ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రిషియన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో ఎలక్ట్రిషియన్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎన్‌టిఆర్ స్టేడియం కమిటి ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ థామస్ ఆల్వా ఎడిసన్ వారసులు ఎలక్ట్రిషియన్స్ చేసేవారన్నారు. ఆయనే లేకుంటే లోకం చీకటిలో ఉండేదన్నారు. ఏ రంగంలో ఐనా కలిసి కట్టుగా ఉంటేనే హక్కులు సాధించుకోగలమన్నారు. రోజువారీ మీరు చేసే పని ప్రమాదకరం, దానికి ట్రయినింగ్ అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యంత్రాలతో ఇసుక తరలింపు

రొయ్యూరులో గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు తూట్లు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు

మండలంలోని రొయ్యూరు, నార్త్ వల్లూరు గ్రామాలలో ప్రభుత్వ ఇసుక క్వారీలు నడుస్తున్నాయి. గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధన ప్రకారం ఈ క్వారీలలో యంత్రాలకు ప్రవేశం లేదు. కార్మికులు మాత్రమే ఇసుక లోడింగ్ చేయాలి. ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా, కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉచిత ఇసుక విధానానికి ఇక్కడ తిలోదకాలు నడుస్తున్నాయని,పేరుకే ప్రభుత్వ క్వారీలు కానీ వీటిని నడిపేది మాత్రం పలుకుబడి ఉన్న రాజకీయ నాయకులని గ్రామాల్లో పెద్ద చర్చ నడుస్తుంది. రొయ్యూరు క్వారీలోసోమవారం నాలుగు యెస్కవేటర్లతో పట్టపగలే లారీలలోకి ఇసుకను లోడింగ్ చేస్తున్నారు. గ్రామంలోని కొంతమంది కార్మికులతో మెషిన్ లోడింగ్ చేసుకునే విధంగా బేరాలు మాట్లాడుకుని దందా సాగిస్తున్నారు. మిషన్లతో ఇసుకను తోడేయడం వలన నీటి ఊట బయటపడి పెద్ద పెద్ద చెరువులను తలపిస్తుంది. రాత్రి పగలు తేడా లేకుండా పెద్ద పెద్ద లారీలలో ఇసుక తరలిపోతుంది. నది పాయ ఒడ్డున ఇసుక రీచ్ స్టాక్ పాయింట్లు ఉన్నప్పటికీ నామమాత్రంగా కొంత ఇసుకను తెచ్చి స్టాక్ పాయింట్ లో నిల్వ చేస్తున్నారు. కానీ నేరుగా ఇసుక రీచ్ లో నుంచే పెద్ద పెద్ద లారీలు బయటకు పోతున్నాయి. సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం ప్రభుత్వ ఖజానాకు గండి పడినట్లు అవుతుంది. స్టాక్ పాయింట్ల వద్ద ఎక్కడ కాటాలు గానీ, సీ సీ కెమెరాలుగాని లేవు. ఇసుక లోడింగ్ చేసే ప్రదేశంలో సీసీ కెమెరాలు ఒకచోట ఉంటే ఇసుక తవ్వకాలు మరొక ప్రాంతంలో అక్రమంగా జరుగుతున్నాయి. భారీ యంత్రాలతో ఇసుకను తోడేయడం వలన వరద సంభవించినప్పుడు తమ పొలాలు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని,భూగర్భ జలాలు అడుగంటి పోయే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.



లారీలోకి ఇసుక లోడు చేస్తున్న యంత్రాలు



ఇసుక తోడేయడం వల్ల నీటి ఊట బయటపడి చెరువులను తలపిస్తున్న నదీపాయలు



మాట్లాడుతున్న జస్టిస్ రాజశేఖర్

రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ

విజయవాడ : 'పూలే-అంబేద్కర్ ట్యూషన్ పాయింట్ (కెవిపిఎస్) ఆధ్వర్యంలో మాచవరంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో, వివిధ సంఘాల పెద్దలతో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. మాచవరం ఏలూరు రోడ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జి.నటరాజు ర్యాలీని నడిపించారు. ప్రదర్శన అనంతరం జరిగిన సభకు విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎన్.రాజశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సభకు కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు గుండి మేడ క్రాంతికుమార్ అధ్యక్షత వహించారు. సభలో కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, ఐలు రాష్ట్ర నాయకులు ఆవులు వెంకట్రావు, కళ్యాణమాల రాష్ట్ర అధ్యక్షులు బెజ్జం జాన్ రత్నం, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎకనామిక్స్ సీనియర్ లెక్చరర్ టిపి.బాబు, బిఎస్‌పి నాయకులు కనపర్తి మురళి, బిఎస్ఎన్ఎల్ ఇంజనీర్ ఎన్.సుబ్బారావు సభకు హాజరయ్యారు. మల్లికార్జున అండ్ చంద్రమతి మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ విద్యార్థులకు జరిపిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులం దజేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ రాజశేఖర్ మాట్లాడుతూ 1950 జనవరి 26వ తేదీన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో గాలి,నేల, కొండ, కోన, పల్లె,పట్టణాల్లో నివసించే ప్రజలు మతాలు, కులాలు, ప్రాంతాలు, జాతులు, వివిధ భాషా సంస్కృతులు కలిగి భిన్నత్వంలో ఏకత్వంతో జీవిస్తూ రాజ్యాంగ ఫలాలను అందరం అనుభవిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సభకు హాజరైన సంఘాల నాయకులు గణతంత్ర దినోత్సవం గురించి వారి వారి అనుభవాలను సభకు హాజరైన ప్రజలకు వివరించారు.

దళిత వాడలో రోడ్డు నిర్మాణ పనులు



ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల కేంద్రం, దళితవాడలో గల అంతర్గత రోడ్లు సిమెంటు రోడ్లుగా రూపు దిద్దుకు న్నాయి. చినుకు పడితే చాలు చిత్తడే అనేలా ఎన్నో ఏళ్లుగా బురద మయంగా మారి రాకపోకలకు నానా అవస్థలు పడుతుండేవారు. జిల్లాలోనే అతి పెద్ద దళితవాడగా ఉన్న రెడ్డిగూడెం ఎస్‌సి ఏరియాలో ఏకంగా ఒకేసారి 11 రోడ్లను, 650 మీటర్ల మేర సుమారు రూ.30 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్లుగా మార్చి రహదారుల అభివృద్ధిపై స్థానికులు దృష్టి సారించారు. వారం రోజులుగా ఎస్సీ ఏరియాలో జరుగుతున్న సిమెంటు రోడ్ల నిర్మాణ ప్రక్రియతో స్థానికంగా 20 ఏళ్లుగా సరైన రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడిన కొత్త కాలనీ వాసులు మాత్రం ఈ రోడ్ల నిర్మాణం కోసం కృషి చేసిన వారికి, నిధుల కేటాయింపు చేసిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాదుకు, స్థానిక టిడిపి నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎస్సీ ఏరియాలో సుమారు 500 మీటర్లు సిమెంట్ రోడ్లుగా రూపుదిద్దుకోవలసి ఉందనీ, రెడ్డిగూడెం ఎస్సీ వాడకు వాగుఒడ్డుగూడెంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో సామాజిక భవన నిర్మాణం కూడా చేపట్టి పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇబ్రహీంపట్నం : మూలపాడులో రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సిమెంట్ రహదారుల నిర్మాణానికి సోమవారం ఎంఎల్ఎ వసంత కృష్ణ ప్రసాద్ శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా రూ.22.5 కోట్ల ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేస్తున్నట్లు వెల్లడించారు. మూలపాడులో రూ.75లక్షల నిధులతో నిర్మించిన సిసి రోడ్లను ఇప్పటికే పూర్తి చేయగా జనవరి మొదటివారంలో ప్రారంభించామన్నారు. ఇప్పుడు తాజాగా మరో రూ.1.50 కోట్లు మూలపాడు గ్రామాభివృద్ధికి కేటాయించినట్లు వెల్లడించారు.

సూపర్ సిక్స్ అమలులో విఫలం : డివి కృష్ణ

ప్రజాశక్తి - నందిగామ : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైనా సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం నందిగామ సుందరయ్య భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో డివి.కష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైన ప్రజలకు ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదన్నారు. విద్యార్థులకు తల్లి వందనం, ఫీజు రియింబర్సుమెంటు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు పరీక్షలు రాయడానికి విద్యాసంస్థల యాజమాన్యం ఒప్పుకోవటం లేదన్నారు. తల తాకట్టు పెట్టి తల్లిదండ్రులు అప్పులు చేసి విద్యార్థుల ఫీజులు కడుతున్నారని తెలిపారు. రైతు భరోసా డబ్బులు పడక రైతులు వ్యవసాయం చేయటానికి అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది డిసెంబర్ నాటికి కొత్త ఫించన్లు ఇస్తామని వాగ్దానము చేయడంతో పెద్ద సంఖ్యలో ఫించన్లు కోసం ఆశావహులు ఎదురు చూస్తున్నారని, మహిళలకు నెలకు 1500 ఇస్తామని చెప్పిన హామీ అమలు కాక మహిళలు, డ్వాక్రా మహిళలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం ధాన్యం 2,200కు కొనుగోలు చేయగా, ప్రస్తుత ప్రభుత్వం 1700కు మించి కొనుగోలు చేయడం లేదన్నారు. యూరియా దొరకక రైతు భరోసా కేంద్రాలు పూర్తిగా చేతులు ఎత్తేశాయన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ

డప్పు కళాకారులకు ఇస్తున్న పింఛన్లు కోత పెట్టడానికి ప్రభుత్వం అనేక విధాలుగా ఆంక్షలు పెట్టడం అమానుషం అన్నారు. స్మార్ట్ మీటర్ల ను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు కార్యరూపం రూపొందించి సిపిఎం ఆధ్వర్యంలో దశల వారిగా ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నందిగామలో జి ప్లస్ 3 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి పేదలకు అందజేసి రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు. నందిగామలో ఈనాము భూములు రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నందిగామ మండల కార్యదర్శి కటారపు గోపాల్, సిపిఎం నాయకులు సయ్యద్ ఖాసిం, వి.రవి శేఖర్, ఎం.శ్రీనివాసరావు, ఎవి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆయాలకు జీతాలు పెంచాలి : సిఐటియు

ప్రజాశక్తి - కంచికచర్ల : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు జీతాలు పెంచాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.సోమేశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పార్ట్ టైం వర్కర్ అని చెప్పి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఫుల్ టైం వర్కర్లుగా వారితో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. తరగతి గదులను, బాత్రూములను శుభ్రం చేయడంతో పాటు పిల్లలను కంట్రోల్ చేయటం, టీ, మంచినీళ్లు, రికార్డులను అందించడం, జిరాక్సులు తీసుకోని రమ్మనడం తదితర పనులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారందరినీ ఫుల్ టైం వర్కర్లుగా గుర్తించి వారికి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వర్కర్స్‌కు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ఆయాలను సమస్యలడిగి తెలుసుకుంటున్న సోమేశ్వరరావు

ఎరిగిన ధరలకు అనుగుణంగా వారికి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. సిక్ లీవ్‌లు, పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ అమలు చేయాలని యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు.

అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం : ప్రభుత్వ విప్ సౌమ్య

ప్రజాశక్తి - నందిగామ : ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళుతోందని ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. నందిగామ నియోజకవర్గంలో పలు సిసి రోడ్ల ప్రారంభం, అభివద్ధి పనులకు ఎంపి ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య శంకుస్థాపన చేశారు. మండలంలోని చెరువుకొమ్ముపాలెం, కొత్త బెల్లంకొండ వారి పాలెం, పెద్దవరం గ్రామాల్లో ఎన్ఆర్ఇజిఎస్ నిధుల కింద రూ.35 లక్షల రూపాయల సీసీ రోడ్లు, 193 లక్షలతో కోనాయపాలెం (కాత్రేనిపల్లి - పెద్దవరం) బండిపాలెం గ్రామ తారు (బీటీ) రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో 17 లక్షల 50 వేల రూపాయల సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. క్రక్స్ బయోటెక్ కంపెనీ వారి



సహకారంతో కొత్త బెల్లంకొండ వారి పాలెం గ్రామంలో ఏర్పాటుచేసిన మంచినీటి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం తంగిరాల సౌమ్య మాట్లాడుతూ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకొచ్చిన క్రక్స్ యాజమాన్యం వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఆటల పోటీల విజేతలకు బహుమతులు

విజయవాడ : గణతంత్ర దినోత్సవ సందర్భంగా 30వ డివిజన్ రామకృష్ణ పురంలో ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మ్యూజికల్ చైర్, ముగ్గులు, లెమన్ స్పూన్, స్కిప్పింగ్, బాస్కెట్ లో బాల్, తదితర పోటీలు నిర్వహించాము ఆటల పోటీల్లో 160 మంది పాల్గొన్నారు. సుమారు 300 మంది ఆటల పోటీలు తిలకించారు. బహుమతి ప్రదానోత్సవ సభలో రాష్ట్ర పౌర సంక్షేమ కన్వీనర్ సిహెచ్.బాబూరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి, సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు విజేతలకు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి రాగానే కోడిపందేలు జూదం మద్యంగా మారిపోయిందన్నారు. యువతను చెడుదారి పట్టకుండా వారిలో ఉన్న టాలెంట్ వెలికి తీస్తూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇటువంటి ఆటలు కూడా నిర్వహించడం ముదావహమన్నారు. 30వ డివిజన్ నిర్వహణ కన్వీనర్ వెంకటేశ్వరరావు, స్థానికులు శ్రీ లక్ష్మి లక్ష్మీ దుర్గ,



30వ డివిజన్లో బహుమతులందజేస్తున్న బాబూరావు

సత్యనారాయణ తదితరులు నిర్వహించారు. పి.కృష్ణమూర్తి, సుందరమరాజు, ఎస్‌కె షకీలా, తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణపురంలో ఆటల పోటీల దృశ్యం

సత్యనారాయణపురంలో : సత్యనారాయణపురంలో నిర్వహించిన ఆటల పోటీల్లో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు టి.ప్రవీణ్, నగర కమిటీ సభ్యులు ఎస్‌కె పేరు సాహెబ్ నాయకులు, ఎం.మురళీకృష్ణ, ఆటో యూనియన్ నాయకులు, జె.రాజా, ముత్తయ్య వీర భద్రం తదితరులు పాల్గొన్నారు.

గీత సామాజిక వర్గానికి మద్యం షాపు కేటాయింపు

ప్రజాశక్తి - నందిగామ, కంచికచర్ల : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గీత కులాల అభ్యున్నతి కోసం ప్రత్యేకంగా మద్యం దుకాణాలను కేటాయించారు. అందులో భాగంగా నందిగామ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఒక మద్యం దుకాణం గౌడ కులానికి నందిగామ మండలంలో నోటిఫై చేసినట్లు నందిగామ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.బంగారు రాజు, కంచికచర్ల ఎక్సైజ్ సిఐ అశ్రపున్నీషా భేగం తెలిపారు. దీనికి సంబంధించి రూ.2 లక్షలు దరఖాస్తు రుసుముగా ప్రభుత్వానికి చెల్లించి సంబంధిత గౌడ కులానికి చెందిన ఔత్సాహికులు ఎవరైనా పాల్గొనవచ్చని తెలిపారు. ప్రభుత్వ దుకాణం లైసెన్స్ ఫీజు మొత్తంలో 50శాతం రాయితీ కల్పించినట్లు తెలిపారు. గీత కులాల మద్యం దుకాణాలకు సంబంధించి దరఖాస్తులను ఆన్లైన్, ఆఫ్లైన్ విధానంలో ఫిబ్రవరి 5వ తారీఖు వరకు స్వీకరించనున్నట్లు గీత కులాల మద్యం దుకాణాలకు ఫిబ్రవరి 7 తారీఖున జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కేటాయింపులు జరుగుతాయని తెలిపారు.

30 మందికి జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలో వివిధ ప్రదేశాల్లో మద్యం సేవించి వాహనాలు నడిపే చోదకులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సోమవారం 1వ ట్రాఫిక్ పోలీసు వారు మొత్తం 30 కేసుల్లో మద్యం సేవించి వాహనాలు నడిపే చోదకులను సంబంధిత కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి వెంకటేశ్వర శర్మ ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు. వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలో చేగు, తపోవన్, లిటిల్ ఏంజెల్స్ ప్రైవేటు పాఠశాలల్లో సోమవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు జాతీయ రోడ్డు భద్రత పట్ల అవగాహన కార్యక్రమం మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎంవిఎన్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంవిఎన్ రాజు మాట్లాడుతూ మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దని, పిల్లలకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా పాల్గొన్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన నిర్వహించారు.

పైపులైన్ గోతులతో ఇబ్బందులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : తవ్వి వదిలేసిన పైపులైన్ గోతులతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు అరుణ కాన్వెంట్ ఎదురుగా వాటర్ పైప్ లీకేజీ రిపేర్ కోసం గోతులు తవ్వారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు తెలిపారు. తవ్వి వదిలేసిన పైప్‌లైన్, ప్యాచ్ వర్కులు పూర్తి చేయకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. త్వరగా పైప్‌లైన్ కోసం తవ్విన రోడ్లుకు ప్యాచ్ వర్క్ చేయాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.



పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

బందరులో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, స్వచ్ఛ మచిలీపట్నం గా తీర్చిదిద్దుటకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మున్సిపల్ అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ సోమవారం ఉదయం బస్టాండ్ సెంటర్ వద్ద నుండి కోనేరు సెంటర్, పోర్టు రోడ్డు, రైల్వే స్టేషన్ వరకు పర్యటించి పారిశుధ్యం పరిస్థితులు పరిశీలించారు.నగరంలో ప్రతి షాపు ముందు డస్ట్ బిన్స్ ఏర్పాటు చేసుకోవాలని, చెత్త ఎక్కడపడితే అక్కడ పడకుండా డస్ట్ బిన్స్ ఉపయోగించాలని షాపుల యజమానులకు సూచించారు. ముఖ్యంగా టిఫిన్ బండ్లు, టీ స్టాల్స్ వద్ద తాగేసిన టీ కప్పులు ఎక్కడపడితే అక్కడ పడవేయకూడదని, షాపుల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఉద్బోధించారు. షాపు ప్రతి షాపులు వద్ద నుండి శానిటేషన్ సిబ్బంది వాహనాలలో



చెత్తను సేకరించి తరలిస్తారని తెలిపారు. ఈ అంశాలపై షాపుల వారికి అవగాహన కల్పించాలని, మునిసిపాలిటీ వాహనాల ద్వారా చెత్త సేకరించే సమయాలు వారికి ముందుగా తెలియచేయాలని సూచించారు.బేబీ సెంటర్ వద్ద నుండి ఆర్ఆర్ భవన్ వెనుక రోడ్డులో, రోడ్డు వెంబడి పాడయిన వాహనాలు, విడిభాగాల స్క్రాప్ తో మార్జిన్ ఆక్రమణలు గమనించిన కలెక్టర్ క్లియర్ చేయించాలని ఆదేశించారు.కూరగాయల మార్కెట్లో కేటాయించిన స్థలానికి మించి ముందుకు వచ్చిన షాపులు వెనక్కి జరిపించాలని, షాపుకు కేటాయించిన స్థలంలోనే వ్యాపారం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. రిలయన్స్ మార్ట్ వద్ద బయట చెత్తను గమనించిన కలెక్టర్ రిలయన్స్ సిబ్బందికి క్లాస్ తీసుకున్నారు. పోర్టు రోడ్డులో లైబ్రరీ ఎదుట ఏర్పాటు చేసిన టీ స్టాల్ మార్జిన్ ఆక్రమించి ఏర్పాటు చేసినట్లుగా కనిపిస్తోందని, టౌన్ ప్లానింగ్ అధికారులు వెరిఫై చేయాలన్నారు.నగరంలో డ్రైన్లు లో డీసిల్టింగ్ పనులు చేపట్టుటకు అంచనాలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



చెత్త రిక్షాలు అందజేత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు పంచాయతీ సిబ్బందికి ఐదు కొత్త రిక్షాలను గ్రామ స్పెషల్ ఆఫీసర్ విజయసారధి సోమవారం అందజేశారు. నూతన రిక్షాల ద్వారా శానిటరీ సిబ్బంది గ్రామాలలో తడి, పొడి చెత్తను సేకరిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఏ జె ఎల్ నరసింహారావు, మాజీ సర్పంచ్ చాపరాల బాలాజీ పాల్గొన్నారు.

ఉత్తమ అధికారులకు అభినందనలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని పశు సంవర్ధక శాఖ అధికారులు ఉత్తమ సేవ ప్రశంసాపత్రాలు అందుకున్నవారికి అభినందనలు తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చేతుల మీదగా డాక్టర్ ఏ జగన్నాధ రావు సహాయ సంచారకులు, వెటర్నరీ లైవ్ స్టాప్ ఆఫీసర్ ఎస్ ప్రభాకర్‌రావు, సినియర్ అసిస్టెంట్ కే వెంకటేశ్వరరావు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారికి డాక్టర్ సి.శ్రీనివాసరావు ఉపసంచారకులు, డాక్టర్ ఏ.లక్ష్మీనారాయణ సహాయ సంచారకులు, డాక్టర్ వి.హనుమంతరావు అభినందనలు తెలిపారు.



అధిక ఫీజులు వసూళ్లపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకురావడంతో పాటు విద్యార్థుల మరణానికి కారణమైన నారాయణ శ్రీచైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి వాటి గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)కష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ బాలాజీకి వినతి పత్రం అందజేశారు. ఫీజులు చెల్లించాలని పిల్లలపై తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకురావడంతో కానూరు, తాడిగడప ,కంకిపాడు, గోశాల ప్రాంతాల్లో ఉన్న చైతన్య నారాయణ విద్యాసంస్థల్లో అనేకమంది విద్యార్థిని విద్యార్థులు మరణించడం జరిగిందని దీనిపై జిల్లా యంత్రాంగం స్పందించాలని విద్యాశాఖ అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన వాళ్ల సమాధానం వాళ్ళ వెనక మంత్రి నారాయణ ఉన్నారని ఆ విద్యాసంస్థల జోలికి మేము వెల్లబోమని ఓపెన్ గా చెప్పడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థిని విద్యార్థులు మరణానలకు కారణమైన నారాయణ శ్రీ చైతన్య



యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆ విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని మంత్రి నారాయణను తక్షణమే మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కృష్ణాజిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈ.ప్రేమ్ కుమార్, ఎస్.సమరం, ఉపాధ్యక్షులు వి.కీర్తి పాల్గొన్నారు.

గన్నవరం హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గన్నవరం: ఈ నెల 24, 25 తేదీలలో గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరిగిన గన్నవరం సబ్ జోన్ కీడలలో గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు నైపుణ్యం ప్రదర్శించి విజేతలుగా నిలిచారని పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు జివి రవిబాబు




సోమవారం తెలిపారు. సీనియర్ బాలుర విభాగంలో ఖో ఖో ప్రథమ స్థానం, జూనియర్ ఖో ఖో ప్రథమ స్థానం, కబడ్డీ జూనియర్స్ విభాగంలో గన్నవరం, మరియు కేసరపల్లి సంయుక్త ప్రథమ స్థానం, షటిల్ బాడ్మింటన్ సీనియర్, జూనియర్ విభాగం లో ప్రథమ స్థానం, త్రో బాల్ సీనియర్ విభాగం ద్వితీయ స్థానం, సాఫ్ట్ బాల్ సీనియర్, జూనియర్ విభాగం లో పాఠశాల జట్లు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు రవిబాబు తెలిపారు. ప్రతిభ కనబరచి సెంట్రల్ జోన్ కు అర్హత సాధించిన విద్యార్థులను, వీరికి శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన పాఠశాల వ్యాయమ విద్య సహాయకులు ధనియాల నాగరాజు, షేక్ మీరా సాహెబ్‌లను అభినందించారు.

యువర్ ఫెస్ట్‌లో పాలిటెక్నిక్ విద్యార్థులకు బహుమతులు



బహుమతులు సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: ఉషారామ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, తేలప్రోలు వారు ఈ నెల 24, 25 తేదీల్లో డిప్లొమా విద్యార్థులకు జాతీయస్థాయి యువర్ ఫెస్ట్-2025ను నిర్వహించగా గుడ్లవల్లేరు ఎ.ఎ.ఎన్.ఎమ్ అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్. పాలిటెక్నిక్ విద్యార్థులు టెక్నికల్, కల్చరల్ ఈవెంట్స్ లలో పాల్గొని ప్రథమ, ద్వితీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. వీటిలో టెక్నికల్ ఈవెంట్స్ లలో ఈ.సి.ఈ.విద్యార్థులకు నిర్వహించిన పేపర్ ప్రెసెంటేషన్ లో మేటవేర్స్ అనే అంశంపై సి.హెచ్.జగదీష్ కుమార్‌కు ప్రథమ బహుమతి, కంప్యూటర్, ఏ.ఐ.ఎమ్.ఎల్ విద్యార్థులకు నిర్వహించిన పేపర్ ప్రెసెంటేషన్ లో డి.సుమంత్, కె.గణేష్ నాయక్ లకు ప్రథమ, టి.డి.సాయి వైష్ణవి, వై.రక్షిత లకు ద్వితీయ ద్వితీయ బహుమతి, క్విజ్ లో టి.వి.బాల కౌశిక్ కు ప్రథమ, కె.యహోషువ కు ద్వితీయ బహుమతి, ప్రాజెక్ట్ ఎక్సిబిషన్ లో డి.సుమంత్, కె.గణేష్ నాయక్ లకు ప్రథమ, షేక్ తన్వీర్ అహ్మద్, సయ్యద్ వసీం అక్రమ్, యూ.సంతోష్, వి.నరేంద్ర రెడ్డి లకు ద్వితీయ బహుమతి, పోస్టర్ ప్రెసెంటేషన్ లో ఎ.జాహ్నవి, సి.హెచ్.జోష్నవి లకు ప్రథమ, డి.సుమంత్, కె.గణేష్ నాయక్ లకు ద్వితీయ బహుమతులు లభించాయి. అదేవిధంగా కల్చరల్ ఈవెంట్స్ అయిన సోలో డాన్స్ లో నాయుడు జోయెల్, పి.వి.ప్రీతమ్ లకు ప్రథమ, డ్రాయింగ్ నందు ఆర్.లిల్లి సురేఖ లకు ప్రథమ బహుమతి లభించిందని ప్రిన్సిపాల్ శ్రీ ఎన్.రాజశేఖర్ గారు పేర్కొన్నారు. అలాగే ఇటువంటి జాతీయ స్థాయి ఈవెంట్స్ లో మా విద్యార్థులు పాల్గొన్న ప్రతి అంశంలో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించడం ఆనందించతగ్గ విషయమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బహుమతులు సాధించిన విద్యార్థులను, ఈ.సి.ఈ. విభాగాధిపతి జి.వి.వి.సత్యనారాయణ, కంప్యూటర్ విభాగాధిపతి ఎ.కృష్ణ చైతన్య, ఏ.ఐ.ఎమ్.ఎల్ విభాగాధిపతి ఎన్.హేమంత్‌లను యాజమాన్య సభ్యులు చైర్మన్ డాక్టర్ నాగేశ్వరావు వల్లూరిపల్లి, సెక్రటరీ, కరస్పాండెంట్ సత్యనారాయణరావు వల్లూరుపల్లి, కోసెక్రెటరీ, కరస్పాండెంట్ వల్లూరిపల్లి రామకృష్ణ, ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్ అభినందించారు.



నిడుమోలులో సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-చల్లపల్లి: మొవ్వ మండల పరిధిలోని నిడుమోలులో రైతు బజార్ ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి శీలం నారాయణరావు విజ్ఞప్తి చేశారు. సోమవారం నిడుమోలు గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోరుతూ స్థానిక సచివాలయం మీకోసంలో వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవుడి మాన్యానికి వెళ్లే ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలని కోరారు. గ్రామంలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని వాటిని వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీరాయలంక శ్మశాన వాటికకు వెళ్లే రహదారిని అభివద్ధి చేయాలని కోరారు. జగనన్న కాలనీలో (ఎన్టీఆర్ కాలనీలో) మౌలిక సదుపాయాలు కల్పించాలని, జాతీయ రహదారికి సెంటర్ సర్వీస్ రోడ్డు నిర్మించాలని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద డివైడర్ ఏర్పాటు చేయాలని, పంచాయతీలో పైప్ లైన్ ద్వారా మంచినీరు అందించాలని తదితర సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సచివాలయం అసిస్టెంట్ ఇంజనీర్ పూర్ణకు సమర్పించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపు వెంకటాద్రి, మద్దుల బసవరావు, పామర్తి శ్రీనివాసరావు, డొక్కు బాబ్జి, డొక్కు ఈశ్వరరావు, జొన్నలగడ్డ సీతారామయ్య, డొక్కు రాజ్యలక్ష్మి, జయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల, అసోసియేషన్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మసీ అనుసంధానంతో సోమవారం జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు బయోటెక్నాలజీ బ్రేక్ త్రూస్ రీ డిఫైనింగ్ ఫార్మసీ త్రూ కటింగ్ ఎడ్జ్ రీసెర్చ్ అనే అంశంపై నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ కెఆర్ఎస్ సాంబశివరావు వైస్ ఛాన్సలర్ మాంగల్యతాన్ విశ్వవిద్యాలయం జబల్పూర్ మధ్యప్రదేశ్ నుండి, గౌరవ అతిథిగా డాక్టర్ పి సుధాకర్ అసోసియేట్ ప్రొఫెసర్ బయోటెక్నాలజీ విభాగం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, సదస్సుకు రిసోర్స్ పర్సన్స్‌గా డాక్టర్ జి చంద్రయ్య అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ కే సోమేశ్వరరావు జీవన్ సైంటిఫిక్ టెక్నాలజీ లిమిటెడ్ నుంచి పాల్గొన్నారు. సదస్సు సాంప్రదాయంగా బీఫార్మసీ నాలుగో సంవత్సరపు విద్యార్థిని డిజిఎన్వి గాయత్రి స్వాగతంతో ప్రారంభమైంది. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు మాట్లాడుతూ సదస్సులో 125 మంది ప్రజెంటేషన్ అందిస్తున్నారని తెలిపారు. ముఖ్యఅతిథి డాక్టర్ కే ఆర్ ఎస్ సాంబశివరావు డిఎన్ఏ మైక్రో టెక్నాలజీ అండ్ సిగ్నిఫికెన్స్ ఇన్ డ్రగ్ డెవలప్మెంట్ అనే అంశంపై గెస్ట్ లెక్చర్ అందించారు. నవీన ఫార్మసీరంగంలో రాణించాలంటే ప్రతి రోజు ఏద ఒక కొత్త విషయాన్ని నేర్చుకుంటూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వారి భవిష్యత్తులో ఎన్నో విజయాలు సాధించాలని కోరారు. సుధాకర్ మాట్లాడుతూ రోజురోజుకు ఎన్నో వ్యాధులు ప్రబలుతున్నాయని నూతన ఔషధాల అవసరం ఎంతైనా ఉందని ఆ ఔషధాలను రూపొందించే ఫార్మసిస్ట్ పాత్ర ఎంతో ప్రాముఖ్యమైనదని అన్నారు.



బాలోత్సవాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి - తిరువూరు : ఫిబ్రవరి 22న తిరువూరులో జరగనున్న తిరువూరు బాలోత్సవంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహణ కమిటీ కార్యదర్శి ఎం.హరికృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన బాలోత్సవ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. వరుసగా తిరువూరులో మూడోసారి ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని, నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించి బహుమతులు పొందాలని తెలిపారు. ఈ సమావేశంలో అమరావతి బాలోత్సవ కమిటీ బాధ్యులు రామరాజు, తిరువూరు బాలోత్సవ కమిటీ బాధ్యులు పాపారావు, డాం.ప్రదీప్, రామకృష్ణ, శ్రీనివాసరావు, నాగేంద్ర ప్రసాద్, భరత కుమారి, ఇందిర, సుభానీ, ధన సందరరావు, జగన్మోహన రావు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరిలో కలుపు నివారణ చేపట్టాలి

ప్రజాశక్తి - తిరువూరు : దాళ్వా వరిసాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడి పొందొచ్చని వ్యవసాయ శాఖ తిరువూరు మండల అధికారి పి.పద్మ రైతులకు సూచించారు. దాళ్వా, ఇతర పంటల సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు ఆమె సోమవారం అవగాహన కల్పించారు. వరిపంట మండలంలో 4991 హెక్టార్లలో సాగవుతుండగా 1150 హెక్టార్లలో వెదజల్లే పద్ధ తిలో నాట్లు వేశారని, ఇంతవరకు 3841 హెక్టార్లలో నాట్లు వేశారని తెలిపారు. పెసర 3.6 హెక్టార్లలో మినుము 8 హెక్టార్లలో, మొక్కజొన్న 45.6 హెక్టార్లలో సాగు చేస్తున్నట్లు తెలిపారు. వెదజల్లే పద్ధతిలో ఎకరాకు రూ.5వేలు సాగు ఖర్చు ఆదా అవుతుందని పేర్కొన్నారు. అపరాల సాగుతో కూడా రైతులకు తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం పొందొచ్చని తెలిపారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ సాగుకు రైతులు ప్రాధాన్యమిస్తే నాణ్యమైన దిగుబడులు వస్తాయన్నారు.

ఉచిత పశు ఆరోగ్య శిబిరం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మండలం, చౌటపల్లి గ్రామంలో మండల పశువైద్య అధికారి డాక్టర్ స్వప్న అధ్వర్యంలో సోమవారం ఉచిత పశుఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. పశువులకు చూడు పరీక్షలు, ఎదకు రాని పశువులకు చికిత్సలు, దూడలకు, పాడి పశువులకు మేకలకు, నట్టలు నివారణ మందులు తాగించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వప్న మాట్లాడుతూ పాడి పశువు ఈనిన వెంటనే 45 రోజుల నుండి 60 రోజుల్లో పాలిస్తే చూడు నిలిచే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. దీనివల్ల ప్రతి ఏటా దూడను పొందటంతో పాటు పాల ఉత్పత్తితో ఆర్థిక లాభం పొందొచ్చని రైతులకు అవగాహన కల్పించారు. 114 పశువులకు చికిత్సలు అందించారు. 185 మేకలకు నట్టల నివారణ మందులు తాగించారు. జడ్పీటీసీ యరమల రామ చంద్రారెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ నూతక్కి రాఘవరావు, పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు సెమినార్

విజయవాడ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఐద్వా సెంట్రల్ సిటీ కార్యదర్శి జి.ఝాన్సీ ఆధ్వర్యంలో రాధా నగర్‌లోని సాంఘిక సంక్షేమ హాస్టల్లో సెమినార్ నిర్వహించి హాస్టల్లోని విద్యార్థులకు శానిటరీ నాప్కిన్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న



ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.సరోజ, కె.శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో బాగా రాణించి ఉన్నత స్థాయికి వెళ్ళాలని, హాస్టల్లో విద్యార్థులకు అన్ని రకాల వసతులు ప్రభుత్వాలు కల్పించాలన్నారు. రాజ్యాంగంలో పొందుపరచిన మన హక్కులు, విధులు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవీ కుమారి, అమ్ములు, పిచ్చమ్మ, విజయలక్ష్మి, సత్యా పాల్గొన్నారు.

డ్రెయినేజీలో మురుగు తొలగింపు

ప్రజాశక్తి - విస్సన్నపేట : విస్సన్నపేట మండలం తాతకుంట్ల గ్రామం పేరాబత్తుల దళితవాడలో మండల పరిషత్ పాఠశాల పాఠశాలలో మురుగునీటితో పాటు బురద పేరిగిపోయి డ్రైనేజీ సిమెంట్ తూరల్లో వాడకపు నీరు వెళ్లేందుకు ఆటంకంగా మారి పిల్లలు నడవడానికి ఇబ్బంది కరంగా మారింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ పొద్దుటూరు వెకటేశ్వరరావు సోమవారం మురుగును తొలగించి సిమెంట్ తూరలను శుభ్రం చేయించి డ్రైనేజీలు బాగు చేయించారు.

వాగు పూడ్చివేత ఆపాలని కలెక్టర్‌కు వినతి



మాట్లాడుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని గుంటుపల్లి గ్రామంలో జగమయ్య వాగు లాటరీలతో మట్టిని తరలించి వాగును పూడ్చి వేస్తున్నారు. పూడ్చి వేతను వెంటనే నిలిపివేసి గ్రామ ప్రజలను ముంపు బారి నుంచి కాపాడాలని గుంటుపల్లి గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. గుంటుపల్లి గ్రామస్తులు విజయవాడలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ 1946 నుంచి ఇబ్రహీంపట్నం నుంచి సుమారు 180 కిలోమీటర్లు ప్రయాణించి కొల్లేరులో కలుస్తున్న మురుగు కాలువ (వాగు) నీరు గుంటుపల్లిలో నేడు పేదల ఇళ్లను ముంచెత్తే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాల్వ ఇప్పటికే చాలావరకు ఆక్రమణలకు గురై కుచించుకు పోయిందన్నారు. దీంతో అకాల వర్షాలు, తుపాన్‌లు, వరదలు, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు పై నుంచి వచ్చే ప్రవాహాన్ని తట్టుకుని ప్రవహించే పరిస్థితి లేక గృహాలు ముంపునకు గురై ప్రజలు నానా అవస్థలు పడుతున్నట్లు వివరించారు. సమస్య ఇలా ఉంటే రెండు రోజుల నుంచి గుంటుపల్లి పంచాయతీ సిబ్బంది మిగిలి ఉన్న వాగును సైతం ఎర్ర మట్టితో పూడ్చి వేస్తున్నారని చెప్పారు. వర్షాలు, వరదలు, విపత్తులు సంభవించి ముంపునకు గురైతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రమావత్ వెంకటేశ్వర్లు, కోసూరి వెంకటేష్, ఎండి ఖయ్యూం భాష తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావును గెలిపించండి



మాట్లాడుతున్న ఎ.సుందర్ రావు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, పెన్షనర్ల, నిరుద్యోగ, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, వివిధ ప్రజా సంఘాలు బలపర్చిన పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావును గెలిపించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సుందర్‌రావు పిలుపునిచ్చారు. పట్టణంలోని టీచర్స్ కో-ఆపరేటివ్ బిల్డింగ్‌లో సోమవారం యుటిఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.కృష్ణయ్య అధ్యక్షతన ఎమ్మెల్సీ అభ్యర్థి కె ఎస్ లక్ష్మణరావు గెలుపును కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుందర్ రావు మాట్లాడుతూ శాసనమండలి, బయట ప్రజా సమస్యలపై గళం విప్పే ఎమ్మెల్సీ అభ్యర్థి, ఆంధ్రప్రదేశ్ లో మేధావి, 18 సంవత్సరాలు పాటు ఎమ్మెల్సీగా మూడుసార్లు ఎన్నికైన కెఎస్.లక్ష్మణరావును గెలిపించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్.శ్రీనివాస్, అధ్యక్షులు కె.శ్రీనివాసరావు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.నాగమణి, జిల్లా సహాధ్యక్షురాలు పి.లీల, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జె.సుధానంద్, నాయకులు షేక్ పహార్ సాహెబ్, నరసింహారావు, పల్లవి, హనుమంతరావు, సిఐటియు నాయకులు రాము, నాగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు రణయ తేజ, ఉపాధ్యాయులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలని ర్యాలీ



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందని, ప్రతి ఒక్కరు వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఇబ్రహీంపట్నం ఎస్సై విజయలక్ష్మి కోరారు. రిపబ్లిక్ డే సందర్భంగా లియో హోండా ఆధ్వర్యంలో హెల్మెట్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. పశ్చిమ ఇబ్రహీంపట్నం నుండి ప్రారంభమైన ర్యాలీ ఇబ్రహీంపట్నం సెంటర్ మీదుగా కొండపల్లి పుర వీధుల నుండి సాగుతూ గుంటుపల్లి మీదుగా ఇబ్రహీంపట్నంలోని లియో హోండా షోరూం వద్ద ముగిసింది. ఈ సందర్భంగా విజయలక్ష్మి, లియో హోండా అధినేత సారథి మాట్లాడుతూ ద్విచక్ర వాహన దారులు ఎక్కువగా రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని హెల్మెట్ ధరించడం వలన ప్రమాద తీవ్రత తగ్గి ప్రాణాలు కాపాడుకోవచ్చని తెలిపారు. ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్, లియో హోండా సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని గౌరవరం, పట్టణంలోని జెడ్‌పిహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం బాలల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన సదస్సులో విద్యార్థులకు జిల్లా పిల్లల సంరక్షణ అధికారి ఎమ్.రాజేశ్వరరావు చైల్డ్ రైట్స్, చైల్డ్ మ్యారేజ్, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. సి.డి.పి.ఓ లక్ష్మీ భార్గవి మాట్లాడుతూ విద్యార్థులకు పర్సనల్ హైజిన్, ఎటువంటి ఆహారం తీసుకోవాలి, ఏమైనా ఇబ్బందులు ఉంటే ఎఎన్ఎమ్స్, డాక్టర్ సలహాలను పాటించాలని సూచించారు. ఎసిడిపిఓ నాగమణి మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్యపరంగా జాగ్రత్తలు పాటించాలని, టోల్ ఫ్రీ నెంబర్స్ అందరికీ నోటెడ్ గా ఉండి అవసరమైన సమయంలో ఉపయోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్.సి.పి.ఓ కిరణ్ కుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు రజనీజ్వాల, శారద, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ, గౌరవరం సర్పంచ్ వెంకట్, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఎఎన్ఎమ్స్, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందిస్తామని ప్రతిజ్ఞ



ప్రమాణం చేయించిన గద్దె హరిబాబు

ప్రజాశక్తి , వన్‌టౌన్ : వంటగ్యాస్ వినియోగదారులకు అత్యుత్తమ సేవలను అందజేస్తామని వంటగ్యాస్ డెలివరీ బాయ్‌ల చేత శ్రీ భవాని గ్యాస్ కంపెనీ అధినేత గద్దె శ్రీహరిబాబు ప్రమాణం చేయించారు. సోమవారం సాయంత్రం విద్యాధరపురంలోని భారత్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ శ్రీ భవాని గ్యాస్ కంపెనీలో ప్రొప్రైటర్ గద్దె హరిబాబు డెలివరీ బాయ్‌లకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ వినియోగదారులకు వంటగ్యాస్ వాడకంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వంట గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో డెలివరీ బాయ్‌లు వివరంగా తెలియజేయాలని సూచించారు. అదనంగా డబ్బులు తీసుకోబోమని గ్యాస్ డెలివరీ బాయ్‌లచే ప్రమాణం చేయించడం జరిగింది. సేఫ్టీ క్లినిక్‌లను త్వరలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. వినియోగదారుల భద్రతకు తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు హరిబాబు వివరించారు. నాణ్యత ప్రమాణాలు గల గ్యాస్ స్టవ్ ఉంచుకోవాలని, సురక్షితమైన రబ్బర్ ట్యూబ్ లానే వాడాలని వినియోగదారులను కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ భవాని గ్యాస్ కంపెనీ మేనేజర్ నీలిమ, పెద్ద సంఖ్యలో గ్యాస్ డెలివరీ బాయ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సోమవారం సారా తయారీ కేంద్రాలపై అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లిలో, గంపలగూడెం మండలం అను ముల్లంక గ్రామాల్లో 400 లీటర్ల చొప్పున బెల్లపు ఊట ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ శ్రీనివాస్ తెలిపారు. తిరువూరు ఎక్సైజ్ ఎస్ఐ కృష్ణవేణి ఆధ్వర్యంలో జరిగిన దాడుల్లో సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

తహశీల్దార్, విఆర్‌ఒలకు సన్మానం

ప్రజాశక్తి - విస్సన్నపేట : విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం అవార్డులు ప్రశంసా పత్రాలు పొందిన తహశీల్దార్ కె.లక్ష్మీ కళ్యాణి, విఆర్‌ఒలు సునంద, పాండులను సోమవారం టిడిపి నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నెక్కళపు వెంకటేశ్వరరావు, నెక్కళపు శ్రీనివాసరావు, కపులూరి రాజ, చిరంజీవి పాల్గొన్నారు.

20 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం గ్యాస్ రిపేర్ చేసే షాపులో అక్రమంగా గ్యాస్ సిలిండర్లు నిల్వ చేస్తూ అధిక ధరకు విక్రయిస్తున్న వ్యాపారస్తులపై విజిలెన్స్ అధికారులు సోమవారం మెరుపు దాడి చేశారు. ఆ షాపులో నిల్వ ఉంచిన 17 పెద్ద సిలిండర్లు, 3 చిన్న సిలిండర్లు మొత్తం 20 సిలిండర్లు విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. ఇలా అక్రమంగా నిలవ చేసి అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడిలో విజిలెన్స్ అధికారులు, విఆర్ఓ, పిడిఎఫ్ డిటి పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - తిరువూరు : చిన్నపిల్లలకు ప్రత్యేక ఆధార్ క్యాంపులను ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని ఎంపిడిఒ రవి బాబు విజ్ఞప్తి చేశారు. తిరువూరు మండలంలో చౌటపల్లిలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపును సోమవారం ఆయన పరిశీలించారు. 6 సంవత్సరాలలోపు పిల్లలకు ఈ ప్రత్యేక ఆధార్ క్యాంపులో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. 28, 29 తేదీల్లో అక్కపాలెం, 30న జి.కొత్తూరులో ఈ క్యాంపులు కొనసాగుతా యని తెలిపారు.

ఎలక్ట్రీషియన్ డే వేడుకలు

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల పట్టణంలో ఎలక్ట్రీషియన్ డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షునిగా ఎన్నికైన పంచమర్తి వెంకటేశ్వరరావు నేషనల్ ఎలక్ట్రీషన్ డే సందర్భంగా ప్రమాణ స్వీకారం చేశారు. యూనియన్ కార్యాలయంలో జెండా ఆవిష్కరించిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యూనియన్‌లో సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని, వారి అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తానని తెలిపారు. గౌరవ అధ్యక్షులుగా వి.వెంకటరత్నం, గౌరవ సలహాదారుగా పి.వీరబాబు, ఉపాధ్యక్షులుగా ఎస్.డి.నాగుల్ మీరా, ఎన్.రమేష్, కోశాధికారిగా వై.మల్లేశ్వరరావు, కార్యదర్శి రాజారత్నం, సహాయ కార్యదర్శి చిన్నపరెడ్డిలు పదవీ బాధ్యతలు చేపట్టారు.

మృతుని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - మైలవరం : మైలవరంలోని దేవుని చెరువుకు చెందిన వేముల గంగరాజు సోమవారం ఆకస్మికంగా మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మైలవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు లంక, లితీష్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు అందజేశారు. గంగరాజు కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందన్నారు.

ఇరువర్గాల ఘర్షణలో ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి-ఉయ్యూరు: గ్రానైట్ దిగుమతి చేసేందుకు గుంటూరు నుంచి వచ్చిన ముఠాకార్మికులపై స్థానిక ముఠా కార్మికులు దాడిచేయడంతో 6 మందికి గాయాలైన సంఘటన సోమవారం ఉయ్యూరులో జరిగింది. కాటూరు రోడ్డు అడితీ బజార్లో లారీనుంచి గ్రా నైట్ దిగుమ తి చేసేందుకు గుంటూరు నుంచి కార్మికులు రాగా స్థానిక ముఠాకార్మికులు అక్కడకు చేరుకుని మాప్రాంతానికి వచ్చి మీరు దిగుమతి చేసేందుకు వీలు లేదంటూ అడ్డుకోవ డంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈసఘటనలో గుంటూరుకు చెం దిన నలుగురికి తీవ్రంగా, ఇద్దరికి స్వల్ప గాయాలవ్వగా ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స చే యించుకున్నారు. కార్మికుల ఫిర్యాదు మేర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రులను కలిసిన నారాయణ

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని బిసిలైన తమకు కేటాయించాలని మాజీ కౌన్సిలర్ బొడ్డు శివశ్రీ, నారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరపు అచ్చెన్నాయుడులను క్యాంపు కార్యాలయాల్లో కలిసి వినతిపత్రాలను అందజేశారు.



మంచినీటి పథకానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-ఘంటసాల: ఘంటసాల మండలం యండకుదురు గ్రామంలో బీపీసీఎల్ సీఎస్ఆర్ నిధులు రూ.15 లక్షలతో రక్షిత మంచినీటి పథకం ఆధునీకరణ పనులకు మచిలీపట్నం ఎంపి వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్తో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, టిడిపి మండల కార్యదర్శి తుమ్మల చౌదరి బాబు పాల్గొన్నారు.



లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-అవనిగడ్డ: యువ గళం పాదయాత్రకు సోమవారంతో రెండేళ్లు పూర్తయిన సందర్భంగా అవనిగడ్డ రాజీవ్ సెంటర్లో కూటమి నాయకులు లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం జగన్మోహన్ రెడ్డి అవినీతి అరాచక పాలన తన ఉక్కు సంకల్పంతో తరిమికొట్టేందుకు లోకేష్ యువ గళం పేరుతో పాదయాత్ర ప్రారంభించారన్నారు. పాదయాత్ర వల్ల జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కుప్పకూలడం ఖాయమని భావించిన నాటి ప్రభుత్వం వెంటనే చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై, నియోజకవర్గ నాయకులు బొబ్బా గోవర్ధన్, నియోజకవర్గ అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, కర్ర సుధాకర్, బండే రాఘవ, మేడికొండ విజయ్, రావి రత్నగిరి పాల్గొన్నారు.

అర్జీలను గడువులోగా పరిష్కరించాలి : కలెక్టర్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. సోమవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్, డిఆర్ఓలతో కలిసి మీకోసం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు వారికి అందిన అర్జీలు సమగ్రంగా పరిశీలించి తగిన విచారణ జరిపి నాణ్యమైన పరిష్కారం చూపాలని, ప్రజల సంతప్తి స్థాయి పెరగాలని అన్నారు. అందిన అర్జీలు గడువులోగానే పరిష్కరించాలన్నారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ వివిధ శాఖలలో కోర్టు కేసులలో తీసుకోవలసిన చర్యలు పట్ల వెంటనే స్పందించాలని, కోర్టు ధిక్కరణ కేసులు రాకుండా చూసుకోవాలన్నారు. అర్జీల పరిష్కారంలో నాణ్యమైన పరిష్కారం రావడంలేదని అందువల్ల రీ ఓపెన్ అవుతున్నాయని, కొన్ని శాఖల్లో రీ ఓపెన్ అయినవి కూడా గడువు దాటిపోవడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. డిఆర్ఓ కే చంద్రశేఖర రావు మాట్లాడుతూ కలెక్టరేట్లో పీజీఆర్ఎస్ నోడల్ అధికారి అర్జీల పరిష్కారం గురించి కొంతమంది జిల్లా అధికారులకు ఫోన్ చేసినప్పుడు ఫోన్ ఎత్తడం లేదని తెలిసిందని, వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పిజిఆర్ఎస్ నోడల్ అధికారి శ్రీదేవి మాట్లాడుతూ సమస్య పరిష్కారం కాక ఒకే దరఖాస్తుదారు పలుమార్లు రావడం గమనించామని, ఆ విధంగా జరగరాదన్నారు. ఈ కార్యక్రమంలో బందరు ఆర్డిఓ కే స్వాతి, జడ్పీ సీఈవో కే కన్నమ నాయుడు, డిపిఓ జే అరుణ, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శర్మిష్ట, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: మండలంలోని గరికపర్రు గ్రామంలో ఆదివారం రాత్రి కబడ్డీ విజేతలకు ఆంధ్రప్రదేశ్ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి బహుమతులను అందించారు. మండల టిడిపి అధ్యక్షులు వీరపనేని శివరామ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్స్ వారి సహాయ సహకారాలతో ఉయ్యూరు శివ నాగరాజు (సిఆర్‌పిఎఫ్) ఫ్రెండ్ సర్కిల్ ఏర్పాటు చేసిన గరికపర్రు కబడ్డీ లీగ్ పోటీలు ఆదివారం రాత్రి ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉండవల్లి శ్రీదేవి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి ఉయ్యూరు దండమూడి చౌదరి టీం, ద్వితీయ బహుమతి వల్లూరుపాలెం



గెలుచుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నర్రా అప్పారావు, గూడపాటి గిరిబాబు, దండమూడి చౌదరి, శీలం గణేష్, ఇంటూరి శ్రీనివాసరావు, శీలం నాగరాజు, ఇంటూరి రాము పాల్గొన్నారు.

ఆర్‌డిఒ బాలసుబ్రహ్మణ్యంకు సత్కారం

ప్రజాశక్తి-గుడివాడ: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన సందర్భంగా 76వ గణతంత్ర దినోత్సంలో ప్రశంసాపత్రం అందుకున్న గుడివాడ ఆర్డీవో, గుడివాడ మున్సిపల్ ప్రత్యేకాధికారి బాలసుబ్రహ్మణ్యంను ఆయన కార్యాలయంలో గుడివాడ మున్సిపల్ షాప్స్



అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సోమవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు నవోదయ శ్రీనివాస్, సయ్యద్ గఫార్, కొత్త సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు పరికరాలు బహూకరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి మచిలీపట్నంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ రాసంశెట్టి చంద్రశేఖర్ తాను విద్యనభ్యసించిన కళాశాల అభివృద్ధికి సూర్యనారాయణమూర్తి జ్ఞాపకార్థం కళాశాలలోని భౌతిక శాస్త్రం పరిశోధనాశాలకు రూ.30 వేలు విలువ గల పరికరాలను సోమవారం ప్రిన్సిపాల్ ఎన్‌వి నరసింహారావుకు పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బి శ్రీధర్, ఎస్ వెంకట స్వామి, వివిఎస్ఆర్ కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పరిశీలన

ప్రజాశక్తి-ఉయ్యూరు: వృత్తి విద్యాకోర్సులతో విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు ఉంటుందని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల హెచ్ఎం కె జ్యోత్స్నాదేవి అన్నారు. పాఠశాల వృత్తి విద్యా కోర్సుల విద్యార్థుల క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా సోమవారం నేషనల్ స్కిల్ డెవలప్మెంట్, ఐఆర్టీసీ ఆధ్వర్యంలో కేసీపీ చక్కెర కర్మాగారాన్ని సందర్శించారు. చెరకు క్రషింగ్ నుం చి పంచదార తయారయ్యే వరకు జరిగే ప్రాసెస్సు భద్రతా పరికారాలతో వీక్షించారు. కర్మాగారంలో, యంత్రాల పనితీరును సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ ఆర్ సురేఖ పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-కంకిపాడు



గొడవర్రు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరం మెరిట్ సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు కె.సుబ్రహ్మణ్యం, సర్పంచ్ ఎం.వి.చంద్రశేఖర్, పాఠశాల స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ వక్కలగడ్డ రాము, టిడిపి కోనేరు రాజేష్, మాదు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లెప్రసీ రోగుల గుర్తింపునకు సర్వే



ప్రజాశక్తి-ఘంటసాల

లెప్రసీ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ఫిబ్రవరి 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా టీబీ కంట్రోల్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎ.వెంకట్రావు తెలిపారు. సోమవారం ఘంటసాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అధికారి డాక్టర్ వేణుగోపాల్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. చర్మంపై రాగి రంగు మచ్చలు, చర్మం పొడిగా ఉండటం, అరచేతులు అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, చేతి వేళ్లు కాళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం, చల్లని, వేడి వస్తువులు స్పర్శ తెలియకపోవడం వంటి లక్షణాలు ఉంటే లెప్రసీ వ్యాధి కారణాలుగా గుర్తించి దగ్గరలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వైద్య పరీక్షలకు వెళ్లాలని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో లెప్రసీ వ్యాధి నివారణకు ఎండిటి ఆధునిక వైద్య చికిత్స ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయన్నారు. ఘంటసాల పిఎస్‌సిలో రికార్డులను వారు పరిశీలించారు. పిహెచ్‌సి పరిధిలో ఏఎన్ఎంలు, ఆ శా కార్యకర్తలు ఇంటింటి సర్వే జరుపుతారన్నారు. అనంతరం నివేదికలు పంపుతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ వసుంధర, ఘంటసాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వేమూరి ప్రమోద్ కుమార్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-నాగాయలంక: మండలంలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పర్యటించారు. పర్యటనలో పలు త్రాగునిటీ పథకాల అభివద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎంపీ, ఎమ్మెల్యే. మండలంలో గల కమ్మనమోలలో బీపీసీఎల్ సీఎస్ఆర్ నిధులు రూ.15 లక్షలతో రక్షిత మంచినీటి పథకం ఆధునీకరణ, పర్ర చివర గ్రామంలో గల దీనదయాళపురంలో బీపీసీఎల్ సీఎస్ఆర్ నిధులు రూ.18.50 లక్షలతో ఇరవై వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణానికి అలాగే గుల్లలామోద గ్రామంలో 1.65 కోట్లతొ నిర్మించే మత్స్యకారుల ఫిష్ లాండింగ్ సెంటర్లకు శంకుస్థాపన చేసారు.

క్రీడా దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-ఘంటసాల: ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు గ్రామసర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్ పదివేల రూపాయల ఆర్థిక సహకారంతో ఇరవై జతల క్రీడా దుస్తులు ప్రధానోపాధ్యాయిని శ్రీమతి అమ్మిరెడ్డి అనుపల్లవి, పీడీ బడే వెంకటేశ్వర రావు గార్ల సమక్షంలో సర్పంచ్ పాఠశాల



విద్యార్థి క్రీడకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు, ఎంపీటీసీ చిన్నా, వార్డు సభ్యులు శీలం శ్రీను, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ కోడి కోటేశ్వరమ్మ, వైస్ చైర్మన్ పులగం రాజేంద్ర, పవన్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ (గన్నవరం): బాపులపాడు మండలం వీరవల్లి ఆర్‌పిహెచ్ కాలనీలో అంతర్గత రహదారులు నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి.. ప్రత్యేక పూజలు చేసి సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిల్లా అనితా రామారావు,



ఉపసర్పంచ్ లంక అజయ్ ఎంపిటీసీ అమతపల్లి సూర్యనారాయణ, తెలుగు యువత కార్యదర్శి మండాది రవీంద్ర, ఎంపిటీసీ దూసరి నిర్మల, వార్డు మెంబర్ దూసరి రంగమ్మ, పిల్లా అదష్టరావు, బూత్ ఇంచార్జి డి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదల, కృషితో ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి-అవనిగడ్డ: విద్యార్థులు పట్టుదల కృషితో పాటు ఆత్మవిశ్వాసాన్ని కలిగి ఉండడం ద్వారా విజయ అవకాశాలు మెరుగవుతాయని ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు సూచించారు. సోమవారం ఆవనిగడ్డలోని ఎస్సీఎల్ క్రాంతి కళాశాలలో విద్యార్థులకు మోటివేషన్



తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. నేర్చుకోవాలనే తపన, తెలుసుకోవాలనే ఆత్రుత ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు ఇందుకోసం ప్రతి విద్యార్థి తాను సాధించబోయే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు పట్టుదలతో కృషి చేయాలన్నారు. మానసిక ఏకాగ్రతతో లక్ష సాధన సాధ్యమవుతుందన్నారు. కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కే జలా చంద్రరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వి నాగేశ్వరరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఓటరు చైతన్య పోటీల్లో పిబి సిద్ధార్థకు బహుమతులు



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో పిబి సిద్ధార్థ విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టరేట్ వారు జిల్లాస్థాయిలో ఈనెల 23న ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజయవాడలోని పిబి సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల డేటా సైన్స్ రెండో సంవత్సరం విద్యార్థినులు రామవరపు స్రవంతి వ్యాసరచనలో, పి.హనిత వక్తృత్వ పోటీల్లో రెండో బహుమతి గెలుచుకున్నారు. వీరికి ప్రిన్సిపాల్ డా. మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ ఆచార్య రాజేష్ సి. జంపాల, డేటా సైన్స్ విభాగాధిపతి డా. కొంపల్లి ఉదయశ్రీ, మేథ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్.ఎస్.ఎస్. మూడో యూనిట్ ప్రోగ్రాం ఆఫీసరు ఎం.వెంకటరమణ, తెలుగుశాఖ అధ్యాపకబృందం అభినందనలు తెలిపారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ

ప్రజాశక్తి జగ్గయ్యపేట: జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ న్యాయవాది బెజవాడ బిక్షమయ్యపై పెట్టిన కేసును ఎత్తివేయాలని సోమవారం జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నెపాగ సుందరరావు మాట్లాడుతూ తమ న్యాయవాదిపై తప్పుడు కేసులు పెట్టిన వారికి వత్తాసు పలుకుతూ న్యాయవాది ప్రమేయం లేకుండా ఏ 1 ముద్దాయిగా చేర్చి పిటిషన్ ఇచ్చిన గంటలోనే కేసు నమోదు చేయటం ఏంటని ప్రశ్నించారు. న్యాయవాదిపై పెట్టిన కేసు ఎత్తివేసేంతవరకు రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. వత్సవాయి ఎస్ఐ పెట్టిన కేసును రూపుమాపాలని కోరారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో సీనియర్ న్యాయవాదులు వెంకటరామయ్య, పసుపులేటి సత్య శ్రీనివాసరావు, గోనెల వెంకటేశ్వర్లు, దామాల సంతోష్, ప్రపోల్ల శ్రీకాంత్, ధనుంజయుడు, కరిసే రత్నబాబు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో అర్హులైన వారికి 3 సెంట్లు నివేశన స్థలం, సాగుభూములకు పట్టాలు మంజూరు చేయాలని సిపిఐ నాయకులు జల్లివిల్సన్, సిహెచ్.కోటేశ్వరరావు, ఆవుల శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ గ్రామాల్లో 3 సెంట్లు, చొప్పున ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షలు ఇవ్వాలని, అలాగే 30 సంవత్సరాలుగా పేదలు సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం ముందు నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. జల్లి విల్సన్, సిహెచ్.కోటేశ్వరరావు, ఆవుల శేఖర్ మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా పేదల స్థలాలు విషయంలో మీనమేషాలు లెక్కబెడుతున్నాయని, ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణాల రెండు సెంట్లు ఇస్తానని చెప్పిన మాటను తక్షణమే అమలు చేయాలని, సమీక్షల పేరుతో జాప్యం చేయొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అడపా సుబ్బారావు, సిపిఐ ప్రజా సంఘాల నాయకులు నమ్మిక శ్రీనివాసరావు, కట్టా సుబ్బారావు, బి.చంటి, పోతురాజు సాంబయ్య, మట్టికొయ్య సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్‌కి వినతిపత్రం అందించారు.



పట్టాలివ్వాలని ఆందోళన చేస్తున్న నాయకులు, లబ్ధిదారులు

స్కూల్ గేమ్స్‌లో ఎపి విజయం

◆ అండర్-14 జాతీయ సెపక్ తక్రా ఛాంప్‌గా బాలికలు

◆ బాలుర విభాగంలో ఛాంప్ మణిపూర్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పాఠశాల విద్యాశాఖ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్, ఎన్టీఆర్ స్కూల్ గేమ్స్ సంయుక్తంగా విజయవాడలోని స్థానిక పటమట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు)లో ఈ నెల 24 నుండి జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్, బాలురు విభాగంలో మణిపూర్ జట్లు విజేతగా నిలిచాయి. సోమవారం జరిగిన బాలికల ఫైనల్ పోటీలో ఆంధ్రప్రదేశ్ జట్టు మణిపూర్ నీ 15-13,17-15 పాయింట్ల తేడాతో గెలిచి ఛాంపియన్‌గా నిలిచింది. టోర్నమెంట్ ఆసాంతం ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టు తనదైన అటాకింగ్, డిఫెన్స్ గేమ్‌తో ప్రత్యర్థి జట్లపై పూర్తి ఆధిక్యం కనబరుస్తూనే ఉంది. ఫైనల్‌లో కూడా అదే ఆటతో ప్రత్యర్థిని ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా రెండు సెట్లు పూర్తి ఆధిక్యం కనబరిచి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ జట్టులో కావ్య అద్భుత ఆటతీరుతో జట్టు ఛాంపియన్‌గా అవతరించడానికి ముఖ్య భూమిక కనబరిచింది. మూడో స్థానం బీహార్‌కి దక్కింది. బాలుర విభాగంలో జరిగిన ఫైనల్‌లో మణిపూర్ జట్టు బీహార్‌ని 15-2,15-5 పాయింట్లతో గెలిచి ఛాంపియన్‌గా నిలిచింది. మణిపూర్ జట్టులో బోరిస్ అటాకింగ్, డిఫెన్స్‌లో అత్యంత ప్రతిభ కనబరిచారు. మూడో స్థానం ఢిల్లీ చేజిక్కించుకుంది. అంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవం కార్యక్రమంలో విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎంఎల్ఎ గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఆటల్లో క్రీడాస్ఫూర్తి ముఖ్యం అని, గెలిచిన జట్లుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ జాతీయ టోర్నమెంట్‌కు విజయవాడ విచ్చేసిన వివిధ రాష్ట్రాల జట్లుకు ధన్యవాదాలు తెలిపారు. ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన మణిపూర్ జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. రన్నరప్ సాధించిన మణిపూర్ బాలికల టీంకు రూ.10 వేలు నగదు బహుమతి అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మాజీ శాసనసభ్యులు యలమంచిలి రవి విజేత బాలికల ఆంధ్రప్రదేశ్ జట్టుకు రూ.15వేలు నగదు బహుమతి ప్రకటించారు. ఈ పోటీలను రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి భానుమూర్తి రాజు, సహాయ కార్యదర్శి రాధాకృష్ణ, రాజు,స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పరిశీలకులు గౌతమ్, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు జి.ఎస్తేర్ రాణి, పోటీల కార్యనిర్వహణ కార్యదర్శి రమేష్, స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, కృష్ణాజిల్లా యు19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి రవికాంత తదితరులు పాల్గొన్నారు.



చాంప్‌గా నిలిచిన బాలికల జట్టుతో ఎంఎల్ఎ గద్దె

బకాయి వేతనాలు విడుదల చేయాలని వినతి



ధర్నా నిర్వహిస్తున్న విఒఎలు

ప్రజాశక్తి - విజయవాడ : ఆరు నెలల బకాయి వేతనాలు విడుదల చేయాలని వెలుగు యానిమేటర్స్ (విఒఎ) ఉద్యోగుల సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో, జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీ శకు వినతిపత్రం అందచేశారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ సందర్భంగా విఒఎ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు, ఎ.కమల మాట్లాడుతూ వెలుగు డిపార్ట్‌మెంట్ (డిఆర్‌డిఎ)లో పనిచేస్తున్న, డ్వాక్రా విఒఎలు వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 27, 28, 29, తేదీల్లో అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద నిరసన దీక్షలు చేస్తున్నారని అన్నారు. మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ విఒఎల మెడకు ఉరి తాడులా మారిందన్నారు. దీనివల్ల అనేక సంవత్సరాలుగా పనిచేస్తూ, ఇదే ఉపాధిగా చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారని, డ్వాక్రా సంఘాల్లో రాష్ట్రవ్యాప్తంగా 28 వేల మంది విఒఎలు పొదుపు సంఘాల మహిళలకు దీర్ఘకాలికంగా సేవలందిస్తూ, పేద మహిళలను కూడగట్టడంలో, బ్యాంకుల లావాదేవీల్లో, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో, పేద మహిళలను కూడగట్టి కొత్త గ్రూపులను ఏర్పాటు చేయడంలో, విఒఎలు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆళ్ళ ఉమాదేవి మాట్లాడుతూ దీనిపై ఎన్నికలకు ముందు ధర్నాచౌక్‌లో, పెద్ద ఎత్తున విఒఎలు ఉద్యమం చేస్తున్న సమయంలో, నేటి ప్రభుత్వంలో ఉన్న, టిడిపి తరపున వర్ల రామయ్య తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ సర్క్యులర్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని ఆ విషయం మర్చిపోతే ఎలా ప్రశ్నించారు. ఇటీవల రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ మంత్రి, కొండపల్లి శ్రీనివాస్, మూడు సంవత్సరాల కాల పరిమిత సర్క్యులర్ ఆధారంగా, మూడు సంవత్సరాలు నిండిన వారిని మార్చుకోవచ్చని ప్రకటన చేయడం సరైనది కాదని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకొని పక్షంలో సమ్మెకు కూడా సిద్ధమవుతారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విఒఎ యూనియన్ జిల్లా నాయకులు, టి.విజయలక్ష్మి, వి.సౌజన్యకుమారి పాల్గొన్నారు.

కంటి గాయాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : చిన్న చిన్న కంటి గాయాల పట్ల నిర్లక్ష్యం వహించరాదని, పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఎల్‌విపిఇఐ కన్సల్టెంట్ ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ సుష్యాంక్ అశోక్ భలేరావో తెలిపారు. సోమవారం నగరంలోని డాక్టర్ ఎల్.వి.ప్రసాద్ నేత వైద్య విజ్ఞాన సంస్థ కోడి వెంకటాద్రి చౌదరి ప్రాంగణంలో కంటికి తగిలే గాయాలు (ఓక్యులర్ టిట్రామా) గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ సుష్యాంక్ అశోక్ భలేరావో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. చిన్న గీతలు నుండి తీవ్రమైన గాయం వరకు ఓక్యులర్ గాయాలు దృష్టి జీవన నాణ్యతపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయన్నారు. ఇది తీవ్రమైన దృష్టి లోపం కలిగించే అవకాశం ఉందని, అందువల్ల అవగాహనను సృష్టించడానికి రోగులకు అవగాహన కల్పించడానికి ఓక్యులర్ గాయం ప్రమాదాన్ని తగ్గించడానికి వ్యూహాలపై కొన్ని నివారణకు సంబంధించిన రోగులకు అవగాహన కల్పించడం చాలా ముఖ్యం అన్నారు. ప్రమాదాలు, క్రీడలు, వినోద సంబంధిత గాయాలు (బాస్కెట్‌బాల్, హాకీ, రాకెట్ క్రీడలు), గృహ ప్రమాదాలు, రసాయన బహిర్గతం (గృహ క్లీనర్‌లు, సౌందర్య సాధనాలు, మొక్కలు) బాణసంచా గాయం ఈ తరహా గాయాలు 30 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న రోగులలో 50 శాతం పైగా సంభవించాయని అధ్యయనాలు చెబుతున్నాయన్నారు. పిల్లల్లో కూడా ఈ గాయాలు చాలా సాధారణం గా జరుగుతాయి అన్నారు. కంటికి గాయాలు తగిలిన తర్వాత వైద్యం పొందే కన్నా, ముందస్తు జాగ్రత్తలతోనే కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అన్నారు.

మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : వేరుకుళ్ళు (విల్ట్) తెగులు వల్ల నష్టపోయిన మిర్చి రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని రైతు, కౌలు రైతు సంఘం నాయకులు కాకనబోయిన లింగారావు, దంతాల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రామచంద్రుని పేట గ్రామ సమీపంలో సోమవారం రైతులతో కలిసి వేరుకుళ్ళు తెగులు సోకిన మిర్చి పంటలను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని రామచంద్రుని పేట, షేర్ మహమ్మద్ పేట, తక్కెలపాడు గ్రామాల్లోని మిర్చి పంటలకు వేరుకుళ్ళు తెగులు సోకిందని దీనితో పూర్తిగా మిర్చి పంటలు ఎండిపోయాయని దీనివల్ల రైతులు లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంట చేతికందే సమయంలో రైతులు నష్టపోయారన్నారు. ఒక ఎకరానికి మిర్చి పంటపై రూ.1.50 లక్షల పెట్టుబడి పెట్టారని, కౌలు రైతులు ఎకరం రూ.25 వేలు కౌలుకు తీసుకొని సాగు చేశారన్నారు. ఈ తెగులు వల్ల నష్టపోయిన రైతులకు ఎకరానికి లక్ష రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులపై చిన్న చూపు చూస్తున్నారని, తెలంగాణ లో పండిన పంటపై బోనస్ కూడా ఇస్తున్నారని కానీ ఆంధ్రప్రదేశ్ లో ఆ పరిస్థితి లేదన్నారు. తక్షణమే రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, జస్టిస్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోటా కృష్ణ, రైతులు ఆరెగడ్డ వెంకయ్య, ఆరెగడ్డ హనుమంతరావు, కమ్మాలపల్లి వినోద్, రాయల నాగరాజు, కమ్మాలపల్లి అప్పారావు, పాల్గొన్నారు.



తెగులు సోకిన మిర్చి పంటను పరిశీలిస్తున్న నాయకులు

పాఠశాలలో సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ గ్రామసభలో పాఠశాలలో విద్యాశాఖ విధానాలు, ఎమ్‌డిఎమ్ అమలు తీరు తదితర అంశాల్లో భౌతిక తనిఖీ గురించి సోషల్ ఆడిట్ జిల్లా రిసోర్స్ పర్సన్ జీ.మోహన్ వివరించారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా వంట ఎలా ఉంటుందో పరిశీలించి చూడాలని తెలిపారు. పాయసం, రాగి జావ మొత్తం విద్యార్థులు స్వీకరించే విధంగా అందరూ ప్రోత్సాహించాలని కోరారు. అన్నం వడ్డనలో మిడ్డే మీల్స్ నిర్వాహకులకు పలు సూచనలు అందించారు. తప్పనిసరిగా వంట గ్యాస్ పొయ్యలపై మాత్రమే చెయ్యాలని తల్లి దండ్రులు కోరారు. జి.మోహన్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రయోజనకరమైన అంశం పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు చేసి నిర్వహిం చాలని కోరారు. గేట్‌లో సిసి కెమెరా ఏర్పాటు అవసరాలను చర్చించారు. పాఠశాల వాతా వరణం చాలా బాగుంటుందని ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయినిలను ప్రశంసించారు. ఎస్ఎమ్‌సి చైర్పర్సన్ షేక్ బాజ్ బీ, సభ్యులు పాల్గొని భోజనం రుచిచూశారు.



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు